# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 223

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేది: బుధవారం 16 సెప్టెంబర్ 2026








**ఢిల్లీ, సమయం ప్రతినిధి:** ఏపీ మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్(ఆళ్ల నాని) కన్నుమూశారు. 57 ఏళ్ల నాని ఈరోజు(మంగళవారం) విశాఖలో గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. 1969 డిసెంబర్ 30న పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో ఆళ్ల నాని జన్మించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు అమెరికా, రెండో కుమారుడు ఇంగ్లండ్‌లో విద్యాభ్యాసం చేశారు. 1994లో కాంగ్రెస్ పార్టీ తరఫున రాజకీయ అరంగేట్రం చేసిన నాని.. అదే ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటమి చవిచూశారు. 1999లో ఎన్నికల్లో మరోసారి ఓటమి ఎదురైంది.ఆ తర్వాత 2004లో టీడీపీ అభ్యర్థి అంబికా కృష్ణపై గెలిచి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. 2004- 2013 వరకు ఏపీ శాసనసభలో కాంగ్రెస్ సభ్యుడిగా పనిచేశారు. 2013లో కాంగ్రెస్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014 ఎన్నికలలో వైసీపీ తరఫున అసెంబ్లీ బరిలోకి దిగి ఓటమిపాలయ్యారు. 2017లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2019 ఎన్నికలలో ఏలూరు నియోజకవర్గం నుంచి వైసీపీ తరఫున పోటీచేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఏపీలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి క్యాబినెట్లో ఉప ముఖ్యమంత్రిగా, వైద్యారోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2024 ఎన్నికల్లో వైసీపీ తరఫున ఓడిన ఆళ్ల నాని.. 2024 ఆగస్టు 17న ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆ తర్వాత 2025 ఫిబ్రవరి 13న తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆళ్ల నాని మృతితో ఏలూరు జిల్లాలో విషాద ఛాయలు అలముకున్నాయి.




**సమయం ప్రతినిధి:** ఎన్డీఏ భాగస్వామ్య ప్రభుత్వాలున్న 21 రాష్ట్రాల్లో ఉమ్మడి పౌర స్మృతి (యూనిఫాం సివిల్ కోడ్-యూసీసీ)ని అమలు చేస్తామన్న కేంద్రమంత్రి అమిత్ షా ప్రకటనపై ఆ కూటమికి చెందిన మూడు పార్టీలు ఆచితూచి స్పందిస్తున్నట్టు తెలుస్తోంది. తెలుగు దేశం, జనతా దళ్(యూ), లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) పార్టీలు యూసీసీ ప్రకటన అనంతరం ఆలోచనలో పడినట్టు సమాచారం. ఇప్పటివరకు తాము ఉమ్మడి పౌర స్మృతిపై ఎలాంటి చర్చ జరపలేదని టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. అవసరమైనప్పుడు దానిని పరిశీలిస్తామని ఆయన వివరించారు. మరోవైపు జనతా దళ్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ ఝా స్పందిస్తూ.. యూసీసీ అమలుకు ముందు అమిత్ షాను కలిసి చర్చిస్తానని పేర్కొన్నారు. ఆ పార్టీ చీఫ్ నితీశ్ కుమార్ గతంలో ఉమ్మడి పౌర స్మృతి విధానానికి మద్దతిచ్చారు. అయితే అన్ని వర్గాలతో చర్చించాకే దాన్ని అమలు చేయాలని చెప్పారు. అలాగే లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. వివిధ వర్గాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని, సమగ్ర చర్చలు జరిపాకే యూసీసీపై తమ వైఖరిని వెల్లడిస్తామని తెలిపారు. తాజాగా ఓ ప్రెస్‌మీట్‌లో 2029 ఎన్నికలకు ముందే ఎన్డీఏ పాలిత 21 రాష్ట్రాల్లో ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేస్తామని అమిత్ షా ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు యూసీసీ గుజరాత్, అస్సాం, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో అమలవుతోంది.




**సమయం ప్రతినిధి:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలు ప్రజల్లో మంచి ఆదరణ పొందాయని సీఎం పేర్కొన్నారు. ఇప్పుడు ట్రంప్ కూడా కాంగ్రెస్ హామీలనే కాపీ కొడుతున్నారని అన్నారు. తమ ప్రభుత్వ సంక్షేమ పథకాలు 'బ్లాక్‌బస్టర్' అయ్యాయని శివకుమార్ వ్యాఖ్యానించారు. బెంగళూరులో ఇవాళ (మంగళవారం) డీకే శివకుమార్ మాట్లాడుతూ.. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలతో ప్రజలకు ప్రయోజనం కలుగుతోందని అన్నారు. ఇదే సమయంలో అమెరికా రాజకీయాల్లో ట్రంప్ తాజాగా చేసిన ఓ హామీని ఆయన ప్రస్తావించారు. నవంబర్‌లో జరిగే మిడ్‌టర్మ్ ఎన్నికల్లో రిపబ్లికన్లు ప్రతినిధుల సభ, సెనెట్‌పై ఆధిపత్యాన్ని కొనసాగిస్తే.. ప్రతి వయోజన అమెరికన్‌కు 5,000 డాలర్ల చొప్పున 'డివిడెండ్' అందిస్తామని ట్రంప్ ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. దీంతో కాంగ్రెస్ హామీలను ఆయన కాపీ కొడుతున్నారని శివకుమార్ చెప్పుకొచ్చారు. కాగా, ఐర్లాండ్‌లో గత ఆదివారం ట్రంప్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రిపబ్లికన్లు గెలిస్తే ప్రతి వయోజనుడికి 5,000 డాలర్లు ఇవ్వడం సాధ్యమేనని చెప్పారు. అమెరికా ప్రభుత్వం భారీ మొత్తంలో ఆదాయం సమీకరిస్తోందని, అందువల్ల ఈ డబ్బు చెల్లింపు పెద్ద సమస్య కాదని అన్నారు. గతంలో డల్లాస్‌లో జరిగిన రిపబ్లికన్ పార్టీ సమావేశంలో ట్రంప్ తొలిసారి ఈ వ్యాఖ్యలు చేశారు.




**సమయం ప్రతినిధి :** సీఎం రేవంత్ రెడ్డి తీసుకువచ్చే ప్రతి స్కీమ్ వెనక ఓ పెద్ద స్కాం ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. భూభారతి పేరుతో భూ హారతి చేస్తున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వంపై మండపడ్డారు. 22A అవకతవకలపై జ్యూడీషియల్ ఎంక్వైరీ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో కేటీఆర్ మాట్లాడుతూ.. అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించడానికి మూడేళ్లు ఎందుకు పట్టిందని రేవంత్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. మూడేళ్లపాటు సెటిల్‌మెంట్లు చేసుకొని ఇప్పుడు రెగ్యులరైజ్ చేసుకుంటున్నారని ఆరోపించారు. 30 శాతం కమిషన్లు తీసుకున్న తర్వాత నిషేధిత జాబితాల నుంచి భూములను తొలగిస్తున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి పౌరస్మృతి తీసుకురావాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఉమ్మడి పౌరస్మృతిపై తమ పార్టీలో చర్చించి ఓ నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. యూనిఫాం అని చెప్పి కేవలం ఎన్డీఏ పాలిత రాష్ట్రాలలోనే చట్టం తీసుకువస్తామనడంలో సహేతుకత లేదని అభిప్రాయపడ్డారు. 22A భూముల అంశంపై బుధవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ జవాబు చెప్పాలని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ ఇంటిపైకి వేల మంది గుండాలను కాంగ్రెస్ పార్టీ పంపిందని అన్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ నివాసానికి వెళ్తుంటే మమ్మల్ని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారని చెప్పారు. సోమవారం తన సిబ్బందిని పిలిచి వారిపై కాంగ్రెస్ గుండాలతో పోలీస్ స్టేషన్ లోనే దాడి చేసే ప్రయత్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు హీనంగా ఉన్నాయని ఆందోళన చెందారు. రాష్ట్రంలో పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల కంటే హీనంగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. న్యాయస్థానాలకు వెళ్తున్నాం అక్కడే తమకు న్యాయం జరుగుతుందని అన్నారు. 22Aలో తప్పు చేసింది అధికారులు కాదని మంత్రి అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తప్పును సారీతో సరిపెట్టారని.. అలా కుదరదన్నారు. 30 శాతం కమిషన్ దోపిడి కోసం ప్రభుత్వం తప్పు చేసిందని ప్రజలకు అర్థమైందని తెలిపారు.

2వ పేజీలో...




**సమయం ప్రతినిధి :** రెవెన్యూ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని MCRHRDలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. 22Aపై చర్చ - బుధవారం అసెంబ్లీలో 22A పై చర్చించాల్సిన అంశాలపై సీఎం రేవంత్ సమీక్షించారు. ఈ సందర్భంగా 22A జాబితాపై సీఎం రేవంత్‌కు రెవెన్యూ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సమీక్షలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్, సీఎస్ సంజయ్ జాజుతోపాటు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్ష సీఎం రేవంత్ రెడ్డితో మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, శ్రీధర్ బాబు, వివేక్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బుధవారం అసెంబ్లీలో 22ఏ, ఎల్ నినోపై చర్చ సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహం గురించి వారు చర్చించారు.

**లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి: డిప్యూటీ సీఎం**

నవంబర్19 నుంచి 'రాజీవ్ యువ వికాసం' తొలి విడత సాయం అందిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మంగళవారం ప్రజాభవన్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై ఆయన సమీక్షించారు. రూ. లక్ష లోపు స్వయం ఉపాధి యూనిట్లకు తొలి విడత ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. ఎస్సీ గురుకులాల్లో కేంద్రీకృత యంత్రాలతో వంటశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మెకనైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు రూ. 25 కోట్ల నిధుల విడుదల చేస్తున్నట్లు చెప్పారు. 15 రోజుల్లో కేంద్రీకృత వంటశాలలపై కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ గురుకులాల పూర్వ విద్యార్థుల సమగ్ర డేటాబేస్ రూపొందించాలని సూచించారు. పూర్వ విద్యార్థుల స్థితిగతులపై సీఈఎస్ఎస్‌తో సమగ్ర అధ్యయనం చేపట్టాలని తెలిపారు. స్టడీ సర్కిళ్ల పనితీరుపై వివరణాత్మక నివేదిక ఇవ్వాలని తెలిపారు. ఎస్సీ డిగ్రీ కళాశాలల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు. 26 ఏకలవ్య పాఠశాలల నిర్మాణ ప్రతిపాదనలు కేంద్రానికి పంపినట్లు ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు అధికారులు వివరించారు. ఈ సమీక్షకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్, సంక్షేమ శాఖ అధికారులు హాజరయ్యారు.




**హైదరాబాద్, సెప్టెంబర్ 15, సమయం ప్రతినిధి :** ప్రభుత్వ ఉద్యోగులంటే మీ బానిసలు కాదని గుర్తుపెట్టుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సెప్టెంబర్18వ తేదీలోగా వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీఎం రేవంత్ రెడ్డికి ఆమె అల్టిమేటం ఇచ్చారు. సీఎం స్పందించకుంటే హైదరాబాద్ దిగ్బంధానికి సిద్ధం కావాలని ఉద్యోగ సంఘాలకు ఆమె పిలుపునిచ్చారు. మీ పోరాటానికి టీఆర్ఎస్ అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై టీఆర్ఎస్ ఏర్పాటు చేసిన సదస్సులో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. మాట తప్పడం, మడమ తిప్పడమే సీఎం రేవంత్ రెడ్డి ట్రేడ్ మార్క్ అని ఎద్దేవా చేశారు. తమ సమస్యలు తీర్చాలని అడిగితే ఉద్యోగులు, ఉపాధ్యాయులను బెదిరిస్తున్నరంటూ సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఉపాధ్యాయులంతా కూడా ఉద్యోగం కన్నా ఉద్యమమే ముఖ్యమని పోరాటం చేశారని గుర్తు చేశారు. కానీ రేవంత్ రెడ్డి సర్కార్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వమైన ప్రజలకు మెరుగైన పారదర్శకమైన పాలన అందించాలంటే ఉద్యోగుల సహకారం అవసరమని అన్నారు.

3వ పేజీలో...

# కోయిలకొండలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

## ఆసుపత్రిలో ఇన్సులిన్ కొరతపై వెంటనే స్పందన.. పాఠశాలలో పనిచేయని ఫ్యాన్‌కు మరమ్మతుల ఆదేశం

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 15, సమయం ప్రతినిధి :** కోయిలకొండ మండలంలో ప్రభుత్వ సేవల తీరును జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ఎం.పి.డి.ఓ కార్యాలయం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, బి.సి. బాలుర సంక్షేమ వసతి గృహం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి సిబ్బంది హాజరు, ప్రజలకు అందుతున్న సేవలు, వైద్య సౌకర్యాలు, విద్యార్థుల వసతులు, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు.

**ఎం.పి.డి.ఓ కార్యాలయంలో రికార్డుల పరిశీలన**

ముందుగా ఎం.పి.డి.ఓ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ పిటిషన్లు, దరఖాస్తులు, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శుల ఆన్‌లైన్ హాజరు, డైలీ సిట్యుయేషన్ రిపోర్ట్, ముఖ గుర్తింపు ద్వారా నమోదవుతున్న హాజరు వివరాలను ఎం.పి.డి.ఓ లాగిన్‌లో పరిశీలించారు. బూరుగుపల్లి సర్పంచ్‌తో మాట్లాడిన కలెక్టర్ గ్రామంలో పెండింగ్ బిల్లులు, అభివృద్ధి పనులు, మంజూరైన నిధులు, నిధుల వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామీణ యాప్‌లో నమోదైన వివరాలు, వివిధ పథకాల అమలుపై కూడా ఆరా తీశారు. సర్పంచ్ తెలిపిన చెక్కులపై సంతకాల సమస్యను పరిష్కరించేందుకు ఉపసర్పంచ్‌ను పిలిపించి మాట్లాడాలని ఎం.పి.డి.ఓను ఆదేశించారు.

**ఆసుపత్రిలో ఇన్సులిన్ కొరతపై వెంటనే స్పందన**

అనంతరం సి.హెచ్.సిని తనిఖీ చేసిన కలెక్టర్ ఆసుపత్రి రిజిస్టర్లు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న చికిత్స, మందుల లభ్యతపై వివరాలు తెలుసుకున్నారు. కొంతమంది రోగులు ఐరన్ మాత్రలు, ఇన్సులిన్ ఇంజెక్షన్లు అందుబాటులో లేవని కలెక్టర్



దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వెంటనే జిల్లా వైద్యాధికారికి ఫోన్ చేసిన కలెక్టర్ ఇన్సులిన్‌ను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అధికారుల చర్యలతో ఇన్సులిన్‌ను తెప్పించి సంబంధిత రోగికి అందించారు. అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, మందుల నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

2వ పేజీలో...

# సంపాదకీయం

## ఎవరి కోసం ఈ బ్యాంకింగ్ సంస్కరణలు?

మన దేశ ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థలో పెనుమార్పులు జరగబోతున్న సంకేతాలు, ప్రకటనలు అనేకం చూస్తున్నాం. ప్రభుత్వ బ్యాంకుల సేవల మీద ఆధారపడ్డ విస్తృత ప్రజానీకం, మధ్యతరగతి మేధావివర్గం, ప్రజాస్వామ్యవాదులు, చిన్న--మధ్యతరహా పరిశ్రమల అధిపతులు మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకోవాలి, స్పందించాలి. ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఉన్న పొదుపు ప్రజలది. బ్యాంకుల మూలధనం (కాపిటల్) ప్రజలు కట్టిన పన్నుల ఆదాయం నుంచి సమకూర్చినది. లక్షల కోట్ల రూపాయల లాభాలు ఉద్యోగుల శ్రమశక్తితో సంపాదించినవి. భారత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తున్న 'వికసిత్ భారత్-2047' సాధనలో బ్యాంకుల పాత్ర ఎలా ఉండాలో అధ్యయనం చేయడం కోసం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయబోతున్నట్లు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. తదనుగుణంగా, ఆగస్టు 17, 18 తేదీల్లో ఆర్థికమంత్రిత్వ శాఖ నిర్వహించిన ప్రభుత్వరంగ బ్యాంకుల శిఖరాగ్ర సమావేశం ఆ ఉన్నతస్థాయి కమిటీకి నివేదించాల్సిన ప్రతిపాదనల మీద చర్చించింది. దీనికితోడు ప్రధానమంత్రి తన స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో ప్రపంచస్థాయి ఐదు పెద్ద బ్యాంకులలో కనీసం ఒక భారతీయ బ్యాంకు ఉండాలనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇవన్నీ బ్యాంకింగ్ రంగంలో పెనుమార్పులకు సంకేతం. అద్భుతమైన ఈ నినాదాల వెనుక దాగి ఉన్న నిజాలేమిటి? ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఉన్న పొదుపు (డిపాజిట్లు)లో 60శాతం పైగా సొమ్ము సామాన్యులు, ఉద్యోగులు తమ భవిష్యత్తు కోసం, పిల్లల చదువులు, పెళ్లిళ్లకోసం దాచుకున్నదే. ఈ కష్టార్జితాన్ని సేవింగ్స్ ఖాతాలో పెట్టుకుంటే బ్యాంకులు చెల్లించే వడ్డీ 2.5 శాతం నుంచి 2.7శాతం. అదే ఫిక్స్‌డ్ డిపాజిట్ అయితే 6.5శాతం. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ సంవత్సరం ద్రవ్యోల్బణం 6శాతానికి చేరువలో ఉంది. అంటే ప్రతి ఏటా సామాన్యుడు దాచుకున్న పొదుపు విలువ తగ్గుతోంది తప్ప, రూపాయి విలువకు రక్షణ లేదు. బ్యాంకు రుణాల విషయంలో కూడా ప్రజలు ఆర్థికదోపిడీకి గురవుతున్నారు. సంస్కరణల పేరుతో బ్యాంక్ విధానాలలో వచ్చిన మార్పులే దీనికి కారణం. బ్యాంకులు మొత్తం ఇచ్చే రుణాలలో 40శాతం ప్రాధాన్యతా రంగాలైన వ్యవసాయం, చేతి వృత్తులు, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు ఇవ్వాలి. ఈ రుణాలు ఇవ్వని బ్యాంకుల మీద ఒకప్పుడు పెనాల్టీలు వేసేది రిజర్వ్ బ్యాంక్. కానీ బ్యాంకింగ్ సంస్కరణల అమలుతో మైక్రోఫైనాన్స్ కంపెనీలకు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలకు (ఎన్‌బీఎఫ్‌సీ) ఇచ్చిన రుణాలనే ప్రాధాన్యతా రంగాలకు ఇచ్చినట్టుగా పరిగణించడం మొదలయ్యింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు రైతులు, సామాన్యులకు ఇవ్వవలసిన రూ.14 లక్షల కోట్ల సొమ్మును ఎన్‌బీఎఫ్‌సీలకు ఇచ్చాయి. ఇదే సొమ్మును మైక్రోఫైనాన్స్ కంపెనీలు, ఎన్‌బీఎఫ్‌సీలు సామాన్య ప్రజలకు అప్పుగా ఇచ్చి, 20-30శాతం వడ్డీ వసూలు చేస్తూ వేల కోట్ల రూపాయల లాభాలు సంపాదిస్తున్నాయి. ఆ రుణభారం, అప్పుల ఊబి నుంచి బయటపడలేక అనేక కుటుంబాలు బలవన్మరణానికి పాల్పడుతున్న వార్తలు నిత్యం చూస్తూనే ఉన్నాం. బ్యాంకులే నేరుగా అప్పులివ్వొచ్చుగా... మధ్యలో ఈ మధ్యవర్తులెందుకు? వైపరీత్యం ఏమిటంటే బ్యాంకులలో తన పొదుపు సొమ్ము దాచుకునే సామాన్యుడు ఒకవైపు దోపిడీకి గురవుతున్న రుణదాత. రెండోవైపు ఎన్‌బీఎఫ్‌సీల వద్ద అధిక వడ్డీ దోపిడీకి గురయ్యే రుణగ్రహీత. ఈ దోపిడీలను కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఎందుకు అనుమతిస్తున్నాయి? దీనికితోడు, గత ఐదేళ్ల కాలంలో ఖాతాలో మినిమం బ్యాలెన్స్ లేదనో, తగిన బ్యాలెన్స్ లేకుండా చెక్కులు ఇచ్చారనో, ఇంకా అనేక కారణాలతో పెనాల్టీల రూపంలో ప్రభుత్వ ప్రైవేట్ బ్యాంకులు ఖాతాదారుల నుంచి రూ.28,495 కోట్లు వసూలు చేశాయి.పార్లమెంటు చట్టాల ద్వారా ఏర్పడిన ప్రభుత్వ రంగ సంస్థలు లేబర్ చట్టాలను అమలుచేస్తూ 'మోడల్ ఎంప్లాయర్'గా ఉండాలి, పర్మినెంట్ ఉద్యోగులను నియమించాలి. ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలు సక్రమంగా అందించడానికి, పెరుగుతున్న వ్యాపారానికి తగినట్టుగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలి. కానీ ప్రభుత్వరంగ బ్యాంకులలో పర్మినెంట్ ఉద్యోగులకంటే ఎన్నోరెట్లు అధికంగా క్యాజువల్, టెంపరరీ, అప్రెంటిస్, కాంట్రాక్టు, ఫిక్స్‌డ్ టర్మ్, బిజినెస్ కరస్పాండెంట్లు తదితర అనేక రూపాలలో పర్మినెంట్ ఉద్యోగులు చెయ్యాల్సిన పనులే చేస్తున్నారు. వీరికి సరైన జీతాలు, ఇతరత్రా సౌకర్యాలు లేవు. బ్యాంకుల్లో కనీసం లక్షా నలభైవేల పర్మినెంట్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొండి బాకీలను సమర్థవంతంగా వసూలు చెయ్యబోతున్నట్టు ప్రకటించింది. ఆ పేరుతో 'ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టీ చట్టం-2016' చేసింది. ప్రత్యేకంగా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్స్, ఎన్‌సీఎల్‌టీలు సైతం ఏర్పాటు చేశానని చెప్పింది. కానీ, అప్పటివరకూ లేని విధంగా బ్యాంకులు పెద్ద ఎత్తున మొండి బాకీలు రద్దు చేసుకుంటున్నాయి. రిలయన్స్ కమ్యూనికేషన్స్, వీడియోకాన్ ఇండస్ట్రీస్, జీ నెట్వర్క్ లాంటి ఏడు కంపెనీలు అవి చెల్లించాల్సిన సొమ్ములో 97శాతం రద్దయి, 3శాతమే వసూలయ్యింది. ఈ ప్రభుత్వకాలంలో రూ.18 లక్షల కోట్లను మొండి బకాయిలుగా పరిగణించాయి. లక్షలాదిమంది బ్యాంకు ఉద్యోగుల శ్రమతో సంపాదించిన లాభాలు, ప్రజలపై పన్నుల ద్వారా సంపాదించిన పెట్టుబడి ఇలా బాకీల రూపంలో కార్పొరేట్ కంపెనీలకు చేరింది. ప్రభుత్వం చేసిన చట్టాలు బాకీలను వసూలు చెయ్యడం కాక, కార్పొరేట్ రుణాల రద్దును చట్టబద్ధం చేశాయి. ఇదే సొమ్ము సామాన్య ప్రజలకు, వ్యవసాయరంగానికి, ఎంఎస్‌ఎంఈలకు రుణాలుగా ఇచ్చి ఉంటే దేశ ఆర్థికవ్యవస్థ ఎంతో వృద్ధిచెందేది. ఎంప్లాయిమెంట్ పెరిగేది. కార్పొరేట్ శక్తులు, బ్యూరోక్రసీ, రాజకీయ శక్తుల అపవిత్ర కూటమి (నెక్సస్) వలనే ఇంత ప్రజాధనం దోపిడీకి వీలుకలిగిందనేది వాస్తవం కాదా? ఇది కాకులను కొట్టి గద్దలకు వెయ్యటం కాక మరేమిటి?ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలలో అనుభవం ఉన్నవారిని ప్రభుత్వ రంగ బ్యాంకుల మేనేజింగ్ డైరెక్టర్లు, చైర్మన్లు తదితర ఉన్నతాధికారులుగా నియమించాలని, బ్యాంకుల మూలధనంలో విదేశీ పెట్టుబడిని 49శాతానికి పెంచాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. విదేశీ పెట్టుబడి లాభాల కోసమే వస్తుంది, లాభాలు లేకపోతే వాపసు వెళ్తుంది. అప్పుడు బ్యాంకులు ఆర్థిక ఒడుదుడుకులకు లోనవుతాయి, ప్రజల పొదుపు ప్రమాదంలో పడుతుంది. అందుకే, ఈ పరిస్థితులను అధ్యయనం చేసి వాస్తవాలను సామాన్య ప్రజానీకానికి, ప్రజాస్వామ్య శక్తులకు, రైతు, కార్మిక సంఘాలకు, దేశ యువతకు తెలియజేయాలని బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక -యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్-నిర్ణయించింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రజల పొదుపుతో నడుస్తున్న ప్రజాసంస్థలు. ప్రజల పొదుపునకు ద్రవ్యోల్బణం నుంచి రక్షణనిచ్చేవిధంగా వడ్డీ రేట్లు పెంచాలని, దేశ ఆర్థికవ్యవస్థ సమ్మిళిత వృద్ధికి వెన్నెముకలైన వ్యవసాయ రంగానికి, గ్రామీణాభివృద్ధికి, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు, మౌలిక వసతుల రంగానికి ఎటువంటి మధ్యవర్తి సంస్థలు లేకుండా నేరుగా తక్కువ వడ్డీకి రుణాలనివ్వాలని సంఘాలు కోరుతున్నాయి. విధాన నిర్ణయాలు చేసే బ్యాంకు బోర్డులలో ఉద్యోగ సంఘాలకు, రైతు, కార్మిక, ఎంఎస్‌ఎంఈ రంగాల నిపుణులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి. దీనివలన రుణాల మంజూరు, వసూలు లాంటి అంశాలమీద పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులను కాపాడుకోవటం ప్రజలందరి కర్తవ్యం. అది దేశ ఆర్థిక స్వావలంబనకు, సమ్మిళిత వృద్ధికి ఆధారంగా నిలుస్తుంది.

# BLO విధులు నిర్వహిస్తూ మృతి చెందిన అంగన్‌వాడీ టీచర్ విజయ కుటుంబానికి న్యాయం చేయాలి



సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా అంగన్‌వాడీ టీచర్లకు అప్పగించిన BLO విధులను వెంటనే తొలగించాలని కోరుతూ జోగులాంబ గద్వాల జిల్లా అంగన్‌వాడీ టీచర్ల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణతో పాటు BLO విధులు అప్పగించడం వల్ల పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు అందించాల్సిన సేవలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు లేకపోవడంతో ఉన్న సిబ్బందిపైనే అధిక పని భారం పడుతోందన్నారు. ఇటీవల BLO విధులు నిర్వహిస్తూ పని ఒత్తిడితో అంగన్‌వాడీ టీచర్ విజయ గుండెపోటుతో మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఆమె కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పని ఒత్తిడి కారణంగా ఇటీవల రాజీనామా చేసిన అంగన్‌వాడీ సిబ్బంది రాజీనామాలను ఆమోదించకుండా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులను త్వరగా భర్తీ చేయాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లపై పని ఒత్తిడిని తగ్గించి దీూా విధుల నుంచి మినహాయించాలని, MRO, RIల నుంచి వస్తున్న అదనపు ఒత్తిడిని నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో TNGO యూనియన్ అధ్యక్షు రాలు ఇందిర, వీరమ్మ, వెంకటేశ్వరమ్మ, గిరిజ, లక్ష్మీరంగమ్మ, వెంకట్రావమ్మ, పద్మజ, వనజాక్షి, లక్ష్మీ, సుమేధ, రాజేశ్వరి, మోహన, మంజుల, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# మూడు గ్రామాల సర్పంచుల చెక్ పవర్ నిషేధం



### ఎత్తం సర్పంచ్, ఉప సర్పంచ్ సస్పెన్షన్
### జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 15:జిల్లాలో నిబంధనల ఉల్లంఘన, అధికార దుర్వినియోగం, ప్రభుత్వ నిధుల వినియోగంలో అవకతవకలకు సంబంధించి పలువురు ప్రజాప్రతినిధులపై జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. కొల్లాపూర్, పెంట్లవెల్లి, బిజినపల్లి మండలాల పరిధిలోని మూడు గ్రామాల సర్పంచుల చెక్ పవర్‌ను నిషేధిస్తూ, కోడేరు మండలం ఎత్తం గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌లను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ ఉత్తర్వులు జారీ చేశారు.కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి, పెంట్లవెల్లి మండలం పెంట్లవెల్లి, బిజినపల్లి మండలం కారుకొండ గ్రామాల సర్పంచులు గతంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేసినట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా తమకు అప్పగించిన అధికారాలను దుర్వినియోగం చేసినట్లు నిర్ధారణకు రావడంతో ఆయా గ్రామాల సర్పంచుల చెక్ పవర్‌ను నిషేధిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు తెలిపారు.కోడేరు మండలం ఎత్తం గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగంకు సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారు సమర్పించిన వివరణలను అధికారులు పరిశీలించిన అనంతరం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు గుర్తించి ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు వెల్లడించారు. గ్రామపంచాయతీలకు ప్రభుత్వం కేటాయించే నిధులను నిబంధనలకు అనుగుణంగా వినియోగించాలని జిల్లా పంచాయతీ అధికారి సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు తమకు అప్పగించిన బాధ్యతలను నిబంధనల మేరకు నిర్వర్తించాలని, ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# కోయిలకొండలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు





మొదటి పేజీ తరువాయి

### హాస్టల్‌లో ఆహారం, వసతుల పరిశీలన

బి.సి. బాలుర సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, స్టోర్‌రూమ్, ఆహార సరుకుల నిల్వలను పరిశీలించారు. పప్పు తదితర సరుకుల నిల్వలు, వాటి వినియోగంపై సిబ్బందిని ప్రశ్నించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు.

### పాఠశాలలో పనిచేయని ఫ్యాన్.. వెంటనే మరమ్మతులు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ పాఠశాల పరిసరాలు, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహణ, చివరిసారిగా ఫాగింగ్ చేసిన వివరాలను ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారి సమస్యలను తెలుసుకున్నారు. తరగతి గదిలో ఫ్యాన్ పనిచేయకపోవడాన్ని గుర్తించి వెంటనే మరమ్మతులు చేయించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు లేకుండా చూడాలని, మురుగు కాలువలను నిత్యం శుభ్రం చేస్తూ పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు.

### విద్యార్థులకు మత్తు పదార్థాలు విక్రయించకుండా నిఘా

పాఠశాల సమీపంలోని చిన్న దుకాణాన్ని కూడా కలెక్టర్ పరిశీలించి అక్కడ విక్రయిస్తున్న సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు సంబంధించిన పదార్థాలు విక్రయించకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీల్లో కోయిలకొండ ఎం.పి.డి.ఓ ధనుంజయరావు, ఇతర మండల అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.




మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి అసెంబ్లీలో ఎదురుదాడి చేయడం కాదు.. ధరణి రక్షణ కవచంలాగా ఉండేదని గుర్తు చేశారు. ఎవరు ఆస్తికి వారేదే బాధ్యత ఉండేదని పేర్కొన్నారు. ఇప్పుడు తెలవకుండానే రిజిస్ట్రేషన్‌లు అవుతున్నాయని చెప్పారు. యజమానులకు తెలయకుండానే నిషేధ జాబితాలోకి వారి భూములు వెళ్తున్నాయని తెలిపారు.వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పారు.. అలాగే ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందేనని రేవంత్ ప్రభుత్వానికి స్పష్టం చేశారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ భూములను రెగ్యులరైజ్ చేస్తామని చెప్పారని అన్నారు. రెండేళ్లలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిల్లర ప్రయత్నాలతో మమ్మల్ని అసెంబ్లీ నుంచి గెంటేశారని కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ప్రభుత్వానికి సమాధానం చెప్పే సత్తా లేదు... అందుకే మమ్మల్ని సస్పెండ్ చేశారని అన్నారు. సస్పెండ్ చేసిన నాటి నుంచి తాము ప్రజల మధ్యే ఉన్నామన్నారు. 22ఏలో ప్రభుత్వం తప్పు చేస్తే ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారని తెలిపారు. ప్రజల యాజమాన్య హక్కుల్ని బంగాళాఖాతంలో వేశారని రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. 30 శాతం కమిషన్ కోసమే కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టారని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కేటీఆర్ విమర్శించారు.




సమయం ప్రతినిధి: తెలుగు రాష్ట్రాల్లో మావోయిస్టుల లొంగుబాట్ల పరంపర కొనసాగుతోంది. తాజాగా మావోయిస్టు నక్కా సుశీల అలియాస్ లత, లలిత, రేలా, జ్యోతి పోలీసుల ఎదుట లొంగిపోయారు. మంగళవారం నిజామాబాద్ ఎస్పీ సాయి చైతన్య ఎదుట ఆమె లొంగిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్ డివిజన్ కమాండెంట్ మెంబర్ (డీసీఎం)గా ప్రస్తుతం సుశీల బాధ్యతలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఆమె లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ దాదాపుగా తుడిచి పెట్టుకు పోయిందన్నారు. తెలంగాణకు చెందిన ముగ్గురు అగ్రనేతలు మాత్రమే ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని ఎస్పీ వివరించారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లాలో సోమవారం ఇద్దరు మావోయిస్టులు లొంగిపోయారు. నరసరావుపేటలోని అదనపు ఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ సమక్షంలో మావోయిస్టులు కందర్ప దుర్గా ప్రసాద్, గొడ్డళ్ల లచ్చ మ్మ లొంగిపోయారు. కందర్ప దుర్గా ప్రసాద్ స్వస్థలం విశాఖపట్నం లోని అక్కయ్యపాలెం, లచ్చమ్మ స్వస్థలం పల్నాడు జిల్లాలో వెల్దుర్తి మం డలం శ్రీరాంపురం తండా అని ఏఎస్పీ ఈ సందర్భంగా వివరించారు. వీరిద్దరు అర్బన్ డెన్ కీపర్లుగా పని చేశారని తెలిపారు. దేశంలో మావో యిస్టుల నిర్మూలన కోసం కేంద్రం ఆపరేషన్ కగార్ నిర్వహించింది. ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులు లొంగిపోయి.. దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కేంద్రం పిలుపునిచ్చింది.





# వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ

**పోలీసు సిబ్బంది ఐకమత్యం, సమన్వయంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి**
**భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలు.**
**పోలీసుశాఖ ఆధ్వర్యంలో అన్నదానం**

వనపర్తి : వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలతో పాటు భక్తిశ్రద్ధలతో, ప్రశాంతమైన మరియు సురక్షిత వాతావరణంలో నిర్వహించుకొంటూ పోలీసు సిబ్బంది ఐకమత్యం, సమన్వయం, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, అన్నారు మంగళవారం రోజు వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వనపర్తి జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలోని సాయుధ దళ పోలీసు కార్యాలయంలో ప్రతిష్ఠించిన మట్టి గణనాథునికి ఉత్సవాల్లో రెండవ రోజు అన్నదాన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్పీ గారు పోలీసు సిబ్బందితో కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు, సిబ్బందికి అన్నప్రసాదాన్ని వడ్డించి. పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది పరస్పరం సహకరించుకుంటూ ఐకమత్యం, సమన్వయం, అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, విధి నిర్వహణలో క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల భద్రత,





శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేయాలని పోలీసు శాఖ ప్రజల భద్రత కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ప్రజలకు నమ్మకమైన పోలీసింగ్ అందించడమే పోలీసుశాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, వారి సమస్యలను సానుభూతితో విని, తక్షణమే స్పందించేలా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది పనిచేయాలని సూచించారు. జిల్లా ప్రజలందరూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదర భావంతో జరుపుకోవాలని ఎస్పీ కోరారు. ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు పోలీసు శాఖ సూచనలు, నిబంధనలను పాటిస్తూ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే పండుగలను మరింత ప్రశాంతంగా, ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవచ్చని, భక్తి, భద్రత, బాధ్యతతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, వనపర్తి సీఐ, సుగంధరత్నం, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సైలు, మంజునాథ్ రెడ్డి, పర్వతాలు, సీసీఎస్ ఎస్సై, వెంకటేశ్వర్లు, డీసీఆర్బి ఎస్సై, తిరుపతి రెడ్డి, రిజర్వ్ సబ్ఇన్స్పెక్టర్లు, వినోద్, మగ్దూం బారీ, ట్రాఫిక్ ఎస్సై సురేందర్, పోలీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, గోవింద్, పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీసు ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయం

**ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం పూర్తి అయితే రానున్న రోజుల్లో విద్యార్థులకు మరిన్ని ప్రయోజనాలు చేకూరుస్తాయి.**
**ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణాన్ని పరిశీలించిన మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణ మనమడు విజయ్‌కుమార్**
**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను అభినందించిన విజయ్ కుమార్.**



షాద్‌నగర్ : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణ పనులను మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు మనవడు విజయ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల నిర్మాణం, విద్యార్థులకు కల్పించనున్న మౌలిక వసతులు, భవిష్యత్ అవసరాలపై ఆయన వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు అందించాలనే లక్ష్యంతో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీసుకున్న నిర్ణయాన్ని విజయ్‌కుమార్ అభినందించారు. విద్యకు ప్రాధాన్యతనిస్తూ శాశ్వత ప్రాతిపదికన కళాశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం ఎంతో గొప్ప విషయమని ప్రశంసించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం పూర్తయితే రానున్న రోజుల్లో విద్యార్థులకు మరిన్ని ప్రయోజనాలు చేకూరుతాయని విజయ్‌కుమార్ పేర్కొన్నారు. నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యారంగ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని విజయ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాదేపల్లి సిద్ధార్థ కో ఆప్షన్ సభ్యులు వావిలాల సుజీవన్. రమేష్ నిర్మాణ ఇంచార్జీ లింగారెడ్డిగూడెం ఉప సర్పంచ్ అశోక్. మార్కెట్ కమిటీ డైరెక్టర్ రుణాకర్. తదితరులు. పాల్గొన్నారు.

# మాట తప్పడం, మడమ తిప్పడమే సీఎం రేవంత్ రెడ్డి ట్రేడ్ మార్క్: కవిత

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల పేరుతో గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ ఒక్క పథకం కూడా సరిగా అమలు కావటం లేదని తెలిపారు. ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తుండటం కారణంగానే పరిపాలన సజావుగా సాగటం లేదని టీఆర్ఎస్ చీఫ్ వివరించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులను అభివృద్ధిలో డెవలపర్స్‌గా చూస్తామని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులను సంతోష పెట్టేలా, వారిని గౌరవించేలా టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. తెలంగాణ జాగృతి గత 20 ఏళ్లుగా ఏ కార్యక్రమం చేసిన సరే దాన్ని ముందుండి నడిపిందే ప్రభుత్వ ఉపాధ్యాయులేనని తాను గర్వంగా చెబుతానని పేర్కొన్నారు. 2023 ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అన్ని చేస్తామని మాటిచ్చారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు వారిని పట్టించుకోకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ ఉపాధ్యాయుడు, ప్రభుత్వ ఉద్యోగి సంతోషంగా లేరన్నారు. రాష్ట్రంలో 5 లక్షలకు పైగా మాత్రమే పర్మినెంట్ ప్రభుత్వ ఉద్యోగులు ఉంటే.. మరో 5 లక్షల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారని వివరించారు. రిటైర్ అయిన ఉద్యోగులు 2 లక్షల వరకు ఉన్నారని గణాంకాలతో సహా కల్వకుంట్ల కవిత తెలిపారు. వారందరికీ భరోసా ఇచ్చేందుకే ఈ మీటింగ్ పెట్టుకున్నామని ఆమె చెప్పారు. తెలంగాణలో ప్రతి ఒక్కరికీ ఉచితంగా విద్య, వైద్యం అందాలనే ఉన్నత లక్ష్యాన్ని టీఆర్ఎస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుందని కవిత స్పష్టం చేశారు. కానీ ఈ కాంగ్రెస్ సర్కార్ ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. మన రాష్ట్రంలో దాదాపు 6 వందల మండలాలుంటే 8 మంది మాత్రమే పర్మినెంట్ ఎంఈఓలు ఉన్నారని గుర్తు చేశారు. దీంతో ప్రభుత్వ విద్యపై మానిటరింగ్ అనేదే లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. హెడ్ మాస్టర్లను, సీనియార్ టీచర్లనే ఎంఈఓలుగా పెడుతున్నారంటూ రేవంత్ ప్రభుత్వ వైఖరిని ఈ సందర్భంగా ఎండగట్టారు. విద్యార్థులకు పేషియల్ రికగ్నేషన్ అంటూ రిపోర్ట్‌లు అంటూ టీచర్లు పాఠాలు చెప్పకుండా చేస్తున్నారని చెప్పారు. ఇక ఒకే టీచర్ ఉన్న స్కూళ్లలో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. టీచర్లకు సీనియారిటీని బట్టి ఇవ్వాల్సిన ప్రమోషన్లు కూడా ఇవ్వటం లేదన్నారు. గురుకులాలు, డిగ్రీ కాలేజ్‌లలో 40 శాతం ఖాళీలు ఉన్నాయని వివరించారు. ఖాళీలను భర్తీ చేయటం లేదని.. ఉన్న టీచర్లను ఈ ప్రభుత్వం సరిగా చూసుకోవటం లేదని పెదవి విరిచారు. ప్రధాని మోదీ కారణంగా పప్పు, ఉప్పు, చక్కెర ధరలు భారీగా పెరిగాయని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉద్యోగులకు డీఏ ఇవ్వాల్సి ఉంటుందని ప్రభుత్వానికి సూచించారు. కానీ గత 32 నెలలుగా డీఏ ఇవ్వకుండా వారి కరువు భత్యాన్ని ఈ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మింగేశారని కవిత ఎద్దేవా చేశారు. ఇవే సమస్యలపై బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇదే రేవంత్ రెడ్డి గతంలో ఇష్టమొచ్చినట్లు తిట్టారని గుర్తు చేశారు. కానీ ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత ఏమీ చేయటం లేదని అన్నారు. రాష్ట్రంలో లక్షా 20 వేల మంది టీచర్లే ఉంటారు. కానీ వాళ్లతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాలేదని తెలిపారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మళ్లీ అధికారంలోకి రాదని జోస్యం చెప్పారు. ప్రతి ఊళ్లో ఓ స్కూల్ ఉండాలని.. ప్రతి తరగతికి ఓ టీచర్ ఉండాలని టీఆర్ఎస్ ఒక విధానం పెట్టుకుందని వివరించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యను పరిపుష్టం చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యను కాపాడుతామని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు భరోసా ఇచ్చారు. ఈ రాష్ట్రంలో పోలీసుల పరిస్థితి కూడా ఘోరంగా ఉంది. వాళ్లకు రావాల్సిన అన్ని ప్రయోజనాలు పెండింగ్‌లోనే ఉన్నాయని చెప్పుకొచ్చారు. 2003లో రిక్రూట్ అయిన పోలీసులకు ఓపీఎస్ రాలేదని గుర్తు చేశారు. అదే విధంగా 2003లో రిక్రూట్ అయినా టీచర్లకు కూడా ఓపీఎస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. 2003లో రిక్రూట్ అయిన టీచర్లకు ఓపీఎస్ ఇస్తే ప్రభుత్వానికే రూ. 2 వేల కోట్లు మిగులుతాయని తెలిపారు. కనీసం ఈ విషయం కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియటం లేదని ఎద్దేవా చేశారు. వారిని ఓపీఎస్‌కు బదలాయించడం ద్వారా వచ్చే రూ.2 వేల కోట్లతో మిగతా బకాయిలు తీర్చాల్సి ఉందని ప్రభుత్వానికి టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత సూచించారు. ఈ రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం చేసే విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు మాటిమాటికి ఆందోళనలను వాయిదా వేసుకుంటున్నారని చెప్పారు. మనం తల్లి కాంగ్రెస్‌తో పోరాటం చేసి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చుకున్న వాళ్లమని.. ఈ పిల్ల కాంగ్రెస్‌కు భయపడాల్సిన అవసరం లేదని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సూచించారు. మనం ఏపీని చూసి ఉద్యమాలు నేర్చుకోలేదన్నారు. కానీ వైఎస్ జగన్ ప్రభుత్వంపై టీచర్లు పెద్ద ఎత్తున పోరాటం చేసి వాళ్ల డిమాండ్లు సాధించుకున్నారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మనం కూడా అదే విధంగా పోరాటం చేసి డీఏలు సాధించుకోవాలని వారికి స్పష్టం చేశారు. ప్రభుత్వంపై పోరాటం చేసే విషయంలో భయపడుతుండటంతో కిందిస్థాయి ఉద్యోగులకు మీపై నమ్మకం ఉండటం లేదంటూ ఉద్యోగ సంఘం నేతలకు కవిత చురకలంటించారు.

## తెలంగాణ రాష్ట్ర సమితి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షునిగా డాక్టర్ వై వెంకట మూర్తి ఎన్నిక పట్ల హర్షం



వనపర్తి : తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర సమితి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సమితి నూతన కార్యవర్గా న్ని రాష్ట్ర అనుబంధ సంఘాల అధ్యక్షులను జిల్లా అధ్యక్షులను ప్రకటించడం జరిగింది. ఈ కార్యవర్గం లో మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమ కారులు సంఘ సేవకులు డాక్టర్ వై వెంకట మూర్తి తెలంగాణ రాష్ట్ర సమితి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకోవడం పట్ల తెలంగాణ ఉద్యమకారులు మహబూబ్ నగర్ జిల్లా వైద్యులు తెలంగాణ రాష్ట్ర డెంటల్ డాక్టర్ అసోసియేషన్ తోపాటు జిల్లా కవులు కళాకారులు తెలంగాణ రాష్ట్ర సమితి కార్యకర్తలు హర్ష వ్యక్తం చేశారు ఈ సందర్భం గా తెలంగాణ ఉద్యమకారులు తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులు శ్రీధర్ మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్రమే ఏకైక లక్ష్యంగా 2001 నుండి తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొంటూ కవితక్క ఆదేశిం చిన కార్యక్రమాల్లో పాల్గొంటూ కవితకు అత్యంత సన్నిహితుడిగా పేరు పొందారు 2012 నుండి తెలంగాణ జాగృతి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా జాగృతిని బలోపేతం చేస్తూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లారు జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి కల్పనలో భాగంగా పాలమూరు పట్టణంలో జాగృతి ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ సంస్థలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి చూపించారు. గ్రహణం వల్ల అంగవైకల్యం కలిగిన చిన్నారులకు వెయ్యి మందికి పైగా చిన్నారులకు ఉచిత శాస్త్ర చికిత్స చేయించారు గ్రామీణ ప్రాంతాలలో దంత సమస్యల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు స్కూల్ విద్యార్థులకు ఉచిత వైద్యం శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించారు తెలంగాణ డాక్టర్ అసోసియేషన్ జాక్ జేఏసీ ఏర్పాటుచేసి వైద్యులను తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములు చేశారు వీరి సేవలను గుర్తించి కవితక్క తెలంగాణ రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వర్తిస్తూ కవితక్క ఆదేశించిన అన్ని కార్యక్రమాల్లో ముందుంటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నందుకు తెలంగాణ రాష్ట్ర సమితి మహబూబ్ నగర్ జిల్లాTRS జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక పట్ల పాలమూరు మేధావులు పుర ప్రముఖులు కవులు కళాకారులు తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులు అభినందనలు తెలియజేశారు.

## చిన్నచింతకుంట కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు పెట్టెల పంపిణీ



దేవరకద్ర : చిన్నచింతకుంట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు పెట్టెలను పంపిణీ చేసే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల SO హేమలత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీమతి జి.లక్ష్మి గ్రామ సర్పంచ్ శ్రీమతి మానస దశరథ్ ముఖ్య అతిథులుగా పాల్గొని, విద్యార్థినులకు పెట్టెలను అందజేశారు. విద్యార్థుల సంక్షేమానికి ఉపాధ్యాయులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా SO తెలిపారు.

# అబద్ధాలతో గిరిజనులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం




**మహబూబ్‌నగర్:** జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గిరిజనులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశం అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ ప్రసంగంలోని ముఖ్య అంశాలు ఇలా ఉన్నాయి.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. అంబెడ్కర్ అభయహస్తం పథకం ద్వారా ఎస్టీ కుటుంబాలకు రూ. 12 లక్షలకు ఇస్తామని ఇవ్వలేదు. ప్రభుత్వ ప్రొక్యూర్మెంట్.. కాంట్రాక్టు లలో 12 శాతం st లకు రెసర్వేషన్ ఇస్తామని మోసం చేసారు. పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం మాట తప్పిందని అన్నారు. గిరిజన విద్యార్థుల విద్య జ్యోతి పథకం ద్వారా చదువు కోసం రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు ప్రోత్సాహకం అందిస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం హామీని విస్మరించిందన్నారు. కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వంలో గిరిజనుల జనాభాకు అనుగుణంగా ఎస్టీలకు 10% రిజర్వేషన్‌లు ఇవ్వడం జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 3,146 తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించామని, తద్వారా సుమారు 30 వేల మంది గిరిజనులు ప్రజాప్రతినిధులుగా ఎదిగే అవకాశం కల్పించడం జరిగింది. హైదరాబాద్‌లో సేవలాల్ బంజారా భవన్, కొమురం భీం ఆదివాసీ భవన్ ను నిర్మించుకోవడం జరిగింది. గిరిజనుల కోసం సుమారు రూ.100 కోట్ల ఆస్తులు, రూ.25 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. తండాలకు విద్యుత్ సదుపాయం కల్పించడంతో పాటు ఇంటింటికీ తాగునీరు అందించడం జరిగింది.కేసీఆర్ పదేళ్ల పాలనలో తండాల్లో జీవన ప్రమాణాలు గణనీయంగా పెరిగాయి, గురుకులాలు, వసతి గృహాల్లో నాణ్యమైన విద్య, వసతి, భోజన సౌకర్యాలు కల్పించడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గురుకులాలు, వసతి గృహాల్లో పరిస్థితులు అధ్వానంగా తయారయ్యాయి. మూడు సంవత్సరాలు గడుస్తున్నా గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం దారుణమని, రాజకీయంగా కూడా గిరిజనులకు తగిన అవకాశాలు కల్పించడం లేదన్నారు.గిరిజన కార్పొరేషన్లకు తగిన నిధులు కేటాయించి గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలన్నారు.మహబూబ్ నగర్ పట్టణ కేంద్రంలోని ఎదిర లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2 కోట్ల 75 లక్షల రూపాయలతో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.మహబూబ్ నగర్ స్టేడియం గ్రౌండ్స్ సమీపంలో రూ. 1.70 కోట్ల వ్యయంతో కళాశాలలో చదివే గిరిజన విద్యార్థినుల కోసం నిర్మించిన ప్రభుత్వ గిరిజన కళాశాల వసతి గృహాన్ని ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు.మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ అయ్యప్ప కొండ పై 2 వేల గజాల స్థలం తో పాటు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కోటి 10 లక్షల రూపాయలతో గిరిజన భవన్ పూర్తి చేసినట్టు తెలిపారు. గిరిజన విద్యార్థులు.. వర్కింగ్ మహిళల కోసం రూ 4 కోట్లతో అన్ని వసతులతో భవన నిర్మాణం పూర్తి చేసాము. గిరిజన యువతలో నైపుణ్యాలు పెంపొందించేందుకు వనగట్టు వద్ద ప్రత్యేక శిక్షణ కేంద్రం రూ 2.75 కోట్లతో ఏర్పాటు చేశామని తెలిపారు. హన్వాడ మండలం ఎనిమిది తండా వద్ద సంత్ సేవాలాల్ దేవాలయానికి 500 గజాల స్థలం ఇవ్వడంతో పాటు రూ . 10 లక్షల నిధులు మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. హన్వాడ మండలం దాచకపల్లి గ్రామంలో 36 చెంచుల కుటుంబాలు 76 యేండ్ల నుంచి వ్యవసాయం చేస్తున్న పట్టాలు లేవు. 15 ఎకరాల 9 గుంటల పోడు

## మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శ

భూమి ఉంటె అధికారులతో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కారం చేసి పట్టాలు ఇచమని అన్నారు.. పొలాలలు సాగు చేసేందుకు కరెంటు సదుపాయం కల్పించామన్నారు. రైతు బంధు పడుతుంది.. బ్యాంకు ద్వారా రుణాలు పొంది వ్యవసాయం చేస్తున్నారు. చెంచుల కోసం హన్వాడ మండలం యారొనిపల్లి వద్ద 24 ఇండ్ల నిర్మాణం ప్రారంభించాము. చెత్తు వరకు నిర్మాణం పూర్తి ఐంది.. ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయినవి.. శిధిలావస్థలో భవనాలు ఉన్నాయ్. వాటిని పూర్తి చేసి చెంచులకు ఇవ్వాలి. పేద ఎస్టీలకు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో నిర్మాణం చేసిన డబల్ బెడ్ రూమ్స్ లో 167 కేటాయింపు చేసినట్టు తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఎరుకల సంఘానికి కేటాయించిన భూమిని అందించడంలో అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని, వెంటనే ఆ భూమిని వారికి అప్పగించాలన్నారు. అమర్ రాజా కంపెనీ విషతుల్యం అయింది అని తప్పుడు ప్రచారం చేసిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు కంపెనీ మంచిదని మాట్లాడుతున్నారు. మేము అన్ని పరిశీలించిన తరువాతే కంపెనీ తీసుకువచ్చాము. కనీసం వెయ్యి పడకల అస్పత్రి ప్రారంభించలేని పరిస్థితి లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాల్యా నాయక్ ప్రెస్ మీట్. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దాలు చెప్పి గిరిజనులను మోసం చేసింది. గిరిజన బిడ్డల విదేశీ విద్యకు కెసిఆర్ ప్రభుత్వం సహకారం ఇచ్చింది. గురుకుల విద్యాలయాలు.. వసతి గృహాల నిర్వహణ సరిగ్గా లేదు. విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. సర్పంచుల సంఘం జేఏసీ చైర్మన్ ప్రతాప్ నాయక్, బీ ఆర్ ఎస్ పార్టీ హన్వాడ ర్ సెల్ అధ్యక్షులు హరిచందర్, కార్పొరేటర్ రమేష్ నాయక్, సీనియర్ నాయకులు రమేష్ నాయక్, రవీందర్ నాయక్, పూర్య నాయక్, సురేష్ నాయక్, మోహన్ నాయక్, రవి నాయక్. అంబు నాయక్, నెహ్రూ నాయక్, రాజేష్ నాయక్, భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా.. కాంగ్రెస్ పార్టీ
### ఉంద్యాల గ్రామంలో బాధిత కుటుంబాలకు పరామర్శ, ఆర్థిక సాయం



చిన్న చింతకుంట మండలం: దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) సోదరుడు జి. భాస్కర్ రెడ్డి చిన్న చింతకుంట మండలం ఉంద్యాల గ్రామంలో పర్యటించి పలువురిని పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన ,సిపురం రాములు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన భాస్కర్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని భరోసా కల్పిస్తూ ఆర్థిక సాయం అందించారు. అలాగే ప్రమాదవశాత్తు గాయపడిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భానుల మన్యంని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న రిపోర్టర్ సారంగం ని సైతం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వారి కుటుంబానికి భరోసా కల్పిస్తూ ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని, ప్రజల కష్టాల్లో భాగస్వామిగా ఉంటామని భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో... కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె వెంకటేష్ యాదవ్ , ఉంద్యాల గ్రామ సర్పంచ్ కోట్ల ఆంజనేయులు , కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మెయిన్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## యూపీఐ చార్జీలు..
## యూఎస్ ఒత్తిడికి కేంద్రం లొంగిందన్న రాహుల్ గాంధీ

మొదటి పేజీ తరువాయి

**సమయం ప్రతినిధి:** అమెరికా ప్రభుత్వ ఒత్తిడికి కేంద్ర ప్రభుత్వం లొంగిపోయిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తాజాగా ఆరోపించారు. యూపీఐ చార్జీలు విధించే దిశగా చడీచప్పుడూ లేకుండా మార్గం సిద్ధం చేసిందని మండిపడ్డారు. రూ.2 వేల లోపు యూపీఐ లావాదేవీలపై బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు చార్జీలు విధించవద్దంటూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేయడంతో రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజా నోటిఫికేషన్ పలు సందేహాలను లేవనెత్తుతోందని రాహుల్ గాంధీ అన్నారు. ఇది చివరకు అధిక మొత్తాల యూపీఐ లావాదేవీలపై చార్జీల వడ్డనకు దారి తీయవచ్చని అన్నారు. డొనాల్డ్ ట్రంప్‌ను సంతోషపెట్టేందుకు అమెరికా సంస్థలకు కేంద్రం ఈ చర్యతో స్వాగతం పలుకుతోందా? అని ప్రశ్నించారు. ' మర్చెంట్ యూపీఐ చెల్లింపులపై ఎమ్‌డీఆర్‌ను ఇకపై విధించే అవకాశం ఉంది. మొత్తం యూపీఐ లావాదేవీల్లో సంఖ్యా పరంగా వీటి (రూ.2 వేలకు పైబడి లావాదేవీలు) వాటా 5 శాతమే అయినప్పటికీ విలువ పరంగా మాత్రం 65 శాతం. వినియోగదారులపై చార్జీలు వద్దని ప్రభుత్వం చెబుతోంది.

## గిరిజనులకు చేసిన లబ్ధిపై కాంగ్రెస్ శ్వేత పత్రం విడుదల చేయాలి : మాజీ ఎమ్మెల్యే ఆల డిమాండ్

దేవరకద్ర : మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండల కేంద్రంలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఇలా మాట్లాడుతూ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులకు (ST) ప్రత్యేకమైన రోజు సెప్టెంబర్ 17... కేసీఆర్ గిరిజనులకు రిజర్వేషన్లను ఆరు నుండి పది శాతానికి పెంచారు. తండాలను గ్రామ పంచాయతీలుగా డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉంది. “మా తండా మా రాజ్యం” అనే కలను కేసీఆర్ నిజం చేశారు. కేసీఆర్ నాలుగు వేలకు పైగా తండాలను గ్రామ పంచాయతీలుగా చేశారు. ఐదు వందల కంటే జనాభా తక్కువ ఉన్నప్పటికీ గిరిజన సోదరుల డిమాండ్ మేరకు గ్రామ పంచాయతీలుగా చేశాం..ఈ సందర్భంగా సెప్టెంబర్ 17న దేవరకద్ర నియోజకవర్గంలో గిరిజన తండాల్లో ర్యాలీలు, కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయాలని పార్టీ నిర్ణయించింది.కేసీఆర్ హయంలో జరిగిన గిరిజన సంక్షేమం గురించి,కాంగ్రెస్ ఎస్టీలకు ఇచ్చిన హామీల గురించి చర్చ పెడతాం..కాంగ్రెస్ గిరిజనులకు ఇచ్చిన హామీలెంది.అమలు చేసినవి ఏంటి అనేది శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.మూడేళ్లు అయింది...ఎస్టీలకు ఇచ్చిన హామీల సంగతేంటి ప్రభుత్వం సమాధానం చెప్పాలి.. భూత్పూర్ మున్సిపాలిటీ తండాలకు రోడ్ల కోసం 12కోట్లు తీసుకొచ్చాం. మూడేళ్ల తర్వాత కూడా మేము తెచ్చిన పనులకే ప్రారంభిస్తున్నారు.విద్యుత్ సమస్యలతో రైతులు ఇబ్బంది



పడుతున్నారు.రైతులు సబ్ స్టేషన్ ల దగ్గర ధర్నాలు చేస్తుంటే పట్టించుకునే వారు లేరు. శ్రీశైలం లో నీళ్ళు ప్రభుత్వం ఎత్తిపోయడం లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో కందూరు పెద్దవాగు ఎడారిగా మారింది. కక్ష్యపూరిత రాజకీయాలు మానుకోవాలి.

## ముఖ్యమంత్రి ఇలాకాలో కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ...

**తీన్మార్ మల్లన్న సమక్షంలో 'టీఆర్పీ'లోకి కల్వకుర్తి, అచ్చంపేట నుంచి భారీ చేరికలు.! బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా**



నాగర్‌కర్నూల్: జిల్లా కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. టీఆర్పీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు తెలంగాణ రాజ్యాధికార పార్టీ లో చేరారు.నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు బీసం ఆంజనేయులు ఆధ్వర్యంలో కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గాలకు చెందిన గాడిగా ఈశ్వర్ గౌడ్, వడ్డెమన్ నాగరాజు, చెనరెడ్డి సతీష్, నడింపల్లి అమరేందర్ గౌడ్, ముద్దామోలా నిరంజన్, మద్దూనాగుల రమేష్, ఆవుల పర్వతమ్మ, అతినారపు అనురాధ, కౌకుంట్ల వెంకటయ్య, నీలమ్మ, శివలీల, లక్ష్మి, సుశీల, రాధ, మాధవి, కొండమ్మ, పుష్పలత, రాములు, పర్వతాలు, సైదన్న, కుర్మయ్య వారు టీఆర్పీలో చేరారు. వారికి పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి, నూతన మండల అధ్యక్షుల నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. తెలంగాణలో బీసీల, రాజ్యాధికారమే లక్ష్యంగా టీఆర్పీ ముందుకు సాగుతుందన్నారు.సెప్టెంబర్ 17న నిర్వహించ తలపెట్టిన 'బీసీ రాజ్యాధికార యాత్ర'ను జిల్లా ప్రజలు, బహుజన శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో జిల్లాలో మరిన్ని చేరికలు ఉంటాయని జిల్లా అధ్యక్షులు బీసం ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ నారముని నరేష్ యాదవ్, మహిళా అధ్యక్షురాలు తవిటి శైలజ, లింగాల మండల అధ్యక్షులు ఆవుల యాదగిరి పాల్గొన్నారు.

## సెట్విన్ సాంకేతిక శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.... వాకిటి లలిత గారు










మక్తల్ : నియోజకవర్గ కేంద్రంలో మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో ఏర్పాటైన సెట్విన్ సాంకేతిక శిక్షణా సంస్థను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత సూచించారు. మంగళవారం సెట్విన్ కేంద్రాన్ని పరిశీలించిన ఆమె, కేంద్రంలో టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, కంప్యూటర్ ట్రైనింగ్ లలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినులను అడిగి శిక్షణ తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాకిటి లలిత మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి , స్పోర్ట్స్ యూత్ సర్వీసెస్ శాఖ మంత్రిగా ఉన్న వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో తన శాఖలోనే అనుబంధంగా ఉన్న సెట్విన్ కేంద్రాన్ని మక్తల్ కు తీసుకువచ్చారని తెలిపారు. మక్తల్ ప్రాంత మహిళలు స్వయం ఉపాధితో తమకాళ్లపై తాము నిలబడాలని, నారాయణపేట, గద్వాల, వనపర్తి లాంటి జిల్లా కేంద్రాల్లో సైతం లేని సెట్విన్ ను... మక్తల్ లో ఏర్పాటు చేశారంటే ఈ ప్రాంతంపై మంత్రి వాకిటి శ్రీహరి కి ఉన్న ప్రత్యేక అభిమానమని అన్నారు. త్వరలోనే సెట్విన్ కింద మరిన్ని విభాగాలకు సైతం శిక్షణను విస్తరించే యోచనలో మంత్రి వాకిటి శ్రీహరి ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మంత్రి వాకిటి శ్రీహరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు, స్థానిక వార్డు కౌన్సిలర్ కలాల్ శ్రీవిద్య నీల గౌడ్, వార్డు కౌన్సిలర్ రహీం పటేల్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్కారి రవికుమార్, నాయకులు చంద్రకాంత్ గౌడ్, అమర్, గోవిందరావు, నీలప్ప ముదిరాజ్, సెట్విన్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్, ట్రైనర్లు తిమ్మప్ప, స్వప్న, వీరమ్మ, ఫర్హానా, సిబ్బంది ప్రవీణ్, లక్ష్మీ, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.






# నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలి..

- ఇది రైతు దగా ప్రభుత్వం.
- గ్రామాలు చీకట్లలో ఉన్నా పాలకులు మాత్రం వెలుగుల్లో ఉన్నారు..
- ఎమ్మెల్యేకు పార్టీలు మారడం తప్పా అభివృద్ధిపై ధ్యాస లేదు.

గద్వాలలోని రైతుల నిరసన కార్యక్రమంలో పాల్గొన్న...
-టిఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంగళ్ల రంజిత్‌కుమార్.

గద్వాల: రైతులకు 24 గంటల ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను మోసం చేస్తోందని తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంగళ్ల రంజిత్‌కుమార్ ఆరోపించారు. ఇది రైతుల సంక్షేమాన్ని పట్టించుకునే ప్రభుత్వం కాదని, రైతు దగా ప్రభుత్వమని ఆయన విమర్శించారు. గద్వాల అగ్రహారం సమీపంలోని విద్యుత్ ఉపకేంద్రం వద్ద తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులతో కలిసి 24 గంటల ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ శాఖ ఎస్.ఈ కి వినతి పత్రం అందజేసి తక్షణమే కరెంట్ కోతల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా గొంగళ్ల రంజిత్ కుమార్ మాట్లాడుతూ... రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా అందించడం లేదని ఆరోపించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లో ఓల్టేజీ కారణంగా రైతుల వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని, దీంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని తెలిపారు. రాత్రి వేళల్లో విద్యుత్ కోసం పొలాల్లో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ అందకపోవడంతో పంటల దిగుబడిపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.రైతుల సంక్షేమం కోసం గతంలో అమలు చేసిన రైతు బీమా పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు



బీమా ప్రీమియం చెల్లింపులో నిర్లక్ష్యం చేయడం వల్ల రైతు కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులకు పంట రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటికీ అనేక మంది రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ జరగలేదని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని కోరారు.గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి కేవలం అభివృద్ధి పేరుతో పార్టీలు మారడం తప్పా తన అధికారం,సంపాధనం పై ఉన్న ధ్యాస గద్వాల నియోజకవర్గ అభివృద్ధి,సంక్షేమంపై ఏమాత్రం ధ్యాస లేదని విమర్శించారు. గద్వాలలో అధికారిక పార్టీలో రెండు పవర్ సెంటర్లు ఉన్నప్పటికీ నియోజకవర్గ అభివృద్ధిలో ఏమాత్రం మార్పు కనిపించడం లేదన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, రైతుల సమస్యలు, విద్యుత్ సమస్యలపై పాలకులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామాలు చీకట్లలో ఉన్నప్పటికీ పాలకులు మాత్రం వెలుగుల్లో ఉన్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను పట్టించుకోకుండా పాలన సాగించడం ప్రజా వ్యతిరేక విధానమని విమర్శించారు.రైతుల మోటార్లు కాలిపోవడం, లోఓల్టేజీ, విద్యుత్ కోతలతో రాత్రివేళల్లో విద్యుత్ సరఫరా వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులకు 24 గంటల ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం మొండి వైఖరి కొనసాగిస్తే రాబోయే రోజుల్లో రైతులను, ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.రైతుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ పార్టీ వారి తరఫున నిరంతరం పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బుచ్చిబాబు, రంగస్వామి, వెంకట్రాములు, విష్ణు, గోవిందు, బలరాం నాయుడు,రవి,సలీం,సుభాష్, లక్ష్మన్న, గోపాల్,మీసాల కిష్టన్న, చిన్న రాముడు, జమ్మన్న,విజయ్,భీమన్ గౌడ్,దయాకర్, వెంకటేష్,అమ్రేష్, వాసు, నర్సింహా,సర్వేష్,రాము, మల్దకల్, ఆంజనేయులు,కార్యకర్తలు, రైతులు,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్ ఫస్ట్ కార్యాలయంలో ప్రతిష్టించిన వినాయకుడికి ఘనంగా పూజలు



మహబూబ్‌నగర్ :మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో ప్రతిష్టించిన శ్రీ మహాగణపతికి రెండవ రోజు మంగళవారం ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ ఆధ్వర్యంలో, సంతోష్ ఆచార్య మంత్రోచ్ఛారణల మధ్య భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, నాయకులు, శిక్షణ కేంద్రం ఉద్యోగులు, విద్యార్థులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. విఘ్నేశ్వరుని కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గుండా మనోహర్ ఆకాంక్షించారు. గణపతి మండపం ప్రాంగణంలో గౌరవ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నియోజకవర్గంలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను మహబూబ్‌నగర్ ఫస్ట్‌లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ప్రత్యేక కళారూపాల్లో రూపొందించారు. ఈ కార్యక్రమంలో అనిల్, వందేమాతరం ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, నిజలింగప్పతో పాటు మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రం ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ తోనే తండాల అభివృద్ధి

- గిరిజన రిజర్వేషన్లు 6% నుంచి 10%కి పెంచిన ఘనత కేసీఆర్ దే
- 70 ఏళ్లలో కాంగ్రెస్ చేయలేని అభివృద్ధి బీఆర్ఎస్ 9 ఏళ్లలోనే చేసింది
- జడ్చర్ల మీడియా సమావేశంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



జడ్చర్ల సెప్టెంబర్ 15, సమయం ప్రతినిధి: తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్ దేనని, ఉమ్మడి రాష్ట్రంలో తండాలు అభివృద్ధికి దూరంగా ఉండేవని మాజీ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి అన్నారు. జడ్చర్ల పట్టణంలోని అంబేద్కర్ కళాభవన్ లో శుక్రవారం మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ గిరిజన నాయకులు, కార్యకర్తల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఎల్లుండి అన్ని తండాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. సెప్టెంబర్ 17న గిరిజన సోదరుల రిజర్వేషన్ పెంపు డిమాండ్ ను కేసీఆర్ నెరవేర్చారని గుర్తు చేశారు. 6 శాతం నుంచి 10 శాతానికి రిజర్వేషన్లు పెంచారన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో 200 తండాలు ఉంటే కేవలం రెండు తండాల్లో మాత్రమే వాటర్ ట్యాంకులు ఉండేవని, మంచినీటి కోసం తండా వాసులు అనేక కష్టాలు పడ్డారని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా తండాలకు సురక్షిత మంచినీటి సరఫరా చేశామని, తండాల్లో కనీవినీ ఎరగని అభివృద్ధి చేసి చూపించామని అన్నారు. గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని, 70 ఏళ్లలో కాంగ్రెస్, టీడీపీ చేయలేనిది బీఆర్ఎస్ చేసి చూపించిందని, అందుకు తండాల్లో జరిగిన అభివృద్ధే నిదర్శనమని పేర్కొన్నారు. తండాలు గ్రామ పంచాయతీలుగా ఏర్పడిన తర్వాత రూపురేఖలు మారిపోయాయని, వేలాది మంది గిరిజన విద్యార్థులు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ చదువుతున్నారని తెలిపారు. అభివృద్ధి మాటల్లో కాదు చేతల్లో చేసి చూపించామన్నారు. అధికారం ముఖ్యం కాదు, ప్రజల భవిష్యత్తు, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమని, కాంగ్రెస్ హయాంలో తెలంగాణ అభివృద్ధి వెనక్కి వెళ్తోందని విమర్శించారు. అన్ని తండాల్లో కార్యక్రమాలు చేసి కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలపాలని పిలుపునిచ్చారు. జడ్చర్ల ఎమ్మెల్యే ప్రతిదానికి గత ప్రభుత్వంలో అక్రమాలు చేశారు భూకబ్జాలు చేశారు అని చెప్పడం సమంజసం కాదని అధికారులు ఉన్నది వారే కాబట్టి నిరూపించాలని సవాల్ విసిరారు. తన సొంత అన్నపై రంగారెడ్డి గూడా మాజీ సర్పంచ్ గా ఉన్నప్పుడు కరెంటు స్తంభాలు ఎత్తుకుపోయిన కేసు నమోదయిందని దీనిపై వివరణ ఇవ్వాలని, ఎమ్మెల్యే సొంత గ్రామం రంగారెడ్డి గూడలో దేవుని మాన్యాలపై లెక్క తేల్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ లక్ష్మీ శంకర్ నాయక్, పిట్టల మురళి, ప్రనిల్ చందర్, పాలాది రామ్మోహన్, శ్రీశైలం యాదవ్, బి కే ఆర్, నందకిషోర్, శ్రీనివాస్ యాదవ్, కరాటే శ్రీను, బుక్క మహేష్, వీరేష్, మచ్చల శీను, రాజు గౌడ్, చిరంజీవి, పరమటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మక్తల్ లో మహనీయుల విగ్రహాలకు జలాభిషేకాలు




నారాయణ పేట : నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం స్థానిక మున్సిపాలిటీలో మక్తల్ ఏబీవీపీ మక్తల్ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, స్వామి వివేకానంద విగ్రహ వ్యవస్థాపక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్వామి వివేకానంద విగ్రహ ఆవిష్కరణ వారోత్సవములు భాగంగా మక్తల్ పట్టణంలోని మహనీయులు విగ్రహాలకు జలాభిషేకం - పూజ కార్యక్రమములో భాగంగా ప్రతి మహనీయుల విగ్రహాలకు పూజభిషేక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకకర్గం జనసేనపార్టీ ఇంచార్జ్ డాక్టర్ మణికంఠ గౌడ్ స్థానిక ఏబీవీపీ నాయకులు ప్రముఖ వ్యాపారావేత్తలు బీజేపీ నాయకులు హిందూ ధార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎస్ఆర్



మహబూబ్‌నగర్ : నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రతిష్టించిన మహాగణపతికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో మహబూబ్‌నగర్ నగర మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి (ఎంఎస్ఆర్) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గణనాథుని ఆశీస్సులు పొందారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, మహబూబ్‌నగర్ నగరం మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, కార్పొరేటర్లు గిరి గౌడ్, మేగ్యా నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మైత్రి యాదయ్య, చెన్నయ్య , గండేటి నర్సింహులు, రఘు దాసరి, రామకృష్ణ, బొట్టు శ్రీను, రఘు నాయక్,నాగరాజు, రమేష్ నాయక్, మరియు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమయం

బుధవారం 16 సెప్టెంబర్ 2026





# లండన్‌లో అంబేద్కర్ స్మృతి భవనాన్ని సందర్శించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అనిరుద్







(సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్) : భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఉన్నత విద్యను అభ్యసించిన రోజుల్లో లండన్‌లో నివసించిన చారిత్రక భవనాన్ని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి , జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ స్మృతి భవనంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ తన జీవితకాలంలో ఈ భవనంతో కలిగి ఉన్న అనుబంధానికి గుర్తుగా భారత ప్రభుత్వం ఈ భవనాన్ని కొనుగోలు చేసి 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్మృతి భవన్ 'గా అభివృద్ధి చేసిందని తెలిపారు. అంబేద్కర్ విద్యాభ్యాసం, ఆయన ఆలోచనా విధానం, సామాజిక న్యాయం కోసం సాగించిన పోరాటంతో ముడిపడి ఉన్న ఈ చారిత్రక ప్రదేశాన్ని సందర్శించడం ఎంతో గర్వంగా ఉందని యెన్నం శ్రీనివాస్ రెడ్డి, అని రుధ్ రెడ్డి పేర్కొన్నారు. విద్యకు అంబేద్కర్ ఇచ్చిన ప్రాధాన్యత, జ్ఞానం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలన్న ఆయన ఆలోచనలు నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. సమాజంలో సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించడంలో అంబేద్కర్ పోషించిన పాత్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందని అన్నారు. అంబేద్కర్ ఆశయాలు, రాజ్యాంగ విలువలను కాపాడుతూ సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

## కలెక్టర్ కార్యాలయంలో గణపతికి ప్రత్యేక పూజలు

### జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 15, సమయం ప్రతినిధి : మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ప్రతిష్ఠించిన శ్రీ గణపతి విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథునికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి జిల్లా ప్రజల సంక్షేమాన్ని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్.. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకలను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. జిల్లాలో వినాయక చవితి వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, సజావుగా జరిగేలా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించి పండుగను సంతోషకర వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, సహాయ కలెక్టర్ (శిక్షణలో) సాయిశివాని, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నరేందర్, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## బండపల్లి గ్రామ పంచాయతీకి మైక్ సెట్ వితరణ



వనపర్తి, సమయం ప్రతినిధి : బండపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీకి 30 వేల విలువ గల మైక్ సెట్‌ను దాతలు కొమారి రఘుపతి నాయుడు మాజీ ఉప సర్పంచ్ అదే విధంగా జ్ఞానమూర్తి సూర్యనారాయణ వీరాంజనేయులు,శివకుమార్, రాముడు కలిసి ఇప్పించడం జరిగింది. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏ కార్యక్రమం జరిగిన, అలాగే గ్రామంలో పండుగల సందర్భంగా గ్రామ ప్రజలకు భక్తి భావాలు పెంపొందించుటకు ఇట్టి మైకులు ఉపయోగించుకోవాలని, గ్రామపంచాయతీ సెక్రటరీ వసంత,సర్పంచి వారి ఆధ్వర్యంలో ఇట్టి మైకు సెట్టును వినియోగించుకుని కార్యక్రమాలు నిర్వహించుకోవాలని దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉసేనమ్మ లక్ష్మయ్య నాయుడు,నాగరాజు వార్డ్ మెంబర్, తిరుపతయ్య,నరసింహ, శివకృష్ణ, బలరాం, సుధాకర్, బాల గణేష్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు మున్సిపాలిటీ లో కూలీలకు ఉపాధి పనులు కల్పించాలి

**మండలంలోని ఉపాధి కూలీలకు పెండింగ్ కూలి డబ్బులు చెల్లించాలి**

**కరువు బత్యం కూలీలకు ప్రతి కుటుంబానికి 7500 రూపాయలు చెల్లించాలి**




ఆత్మకూరు : అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ డిమాండ్ ఈరోజు అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆత్మకూర్ ఎంపీడీవో కార్యాలయం ముందు మరియు ఉపాధి కార్యాలయాల ముందు చేపట్టిన ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి అఖిల భారత ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ మాట్లాడుతూ ఆత్మకూరులో గతంలో దాదాపు 2000 మంది ఉపాధి కూలీలు జాబు కార్డు పొంది పనిచేయడం జరిగింది మున్సిపాలిటీలోని వారికి ఉపాధి హామీని రద్దు చేయడం వల్ల ఇక్కడ కూలీలందరూ పని లేక ఇబ్బందులు పడుతున్నారు ఆత్మకూరు మున్సిపాలిటీ కేంద్రం లో ప్రజలందరూ వ్యవసాయ కూలిమినేని ఆధారపడి జీవిస్తున్నారు ఇక్కడ ఎలాంటి పరిశ్రమలు లేవు ఈ తరుణంలో ఇక్కడ ఉపాధి పనులను నిషేధించడం బాధాకరం ఈ పరిస్థితులలో దేశంలో రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొని ఉన్నాయి కరువు పరిస్థితుల రిత్యా ఆత్మకూర్ మున్సిపాలిటీలో నీ కార్మికులకు ఉపాధి పనులను కల్పించాలని డిమాండ్ చేయడం జరిగింది. కనీసం పక్క గ్రామాలలో నా ఆధార్ కార్డు ఆధారంగా ఈ కూలీలకు పని కల్పించాలని కోరడం జరిగింది. అంతేకాదు మండలంలో వివిధ గ్రామాలలో పనిచేసి గత మే వరకు పనిచేసిన కూలీలకు ఇంకా కొంతమందికి కూలి చెల్లించడంలో జాప్యం జరుగుతున్నది పెండింగ్ డబ్బులు తక్షణమే ఇవ్వాలి కరువు బత్యంగా ప్రతి కుటుంబానికి 7500 20 కేజీల బియ్యం చెల్లించాలి. 200 రోజులు పని కల్పించాలి. 600 రూపాయలు కూలి చెల్లించాలి. 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలి. వారం వారం డబ్బులు చెల్లించాలి. ప్రతి గ్రామంలో ఉపాధి కూలీల కు పనులు ప్రారంభించాలి. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు రాములు వెంకటన్న గుడిసె లక్ష్మమ్మ వడ్డే సత్తెమ్మ జ్యోతి సునిత ప్రవీణ్ పెంటమ్మ ఎనుముల లక్ష్మి భాగ్యమ్మ చెన్నమ్మ కార్తీక్ మనమ్మ దాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 17న ప్రతి తండాలో ర్యాలీ నిర్వహించి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కి చిత్రపటానికి పాలాభిషేకం చేయాలి



దేవరకొండ: సెప్టెంబర్ 15 (సమయం ప్రతినిధి) : గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ది తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే గిరిజన తండాలకు స్వపరిపాలన కల్పించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌దే కాంగ్రెస్ హామీలకే పరిమితం తెలంగాణలో గిరిజన తండాలు, గూడేలకు ప్రత్యేక గ్రామ పంచాయతీ హోదా కల్పించి, గిరిజనులకు స్వపరిపాలనను అందించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దేనని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన దేవరకొండ నియోజకవర్గ ST ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ .....గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత తెలం గాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఆయన అన్నారు. 2018లో కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 4,383 కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయగా, సుమారు 3,146 తండాలు, గూడేలు స్వతంత్ర గ్రామ పంచాయతీలుగా అప్‌గ్రేడ్ అయ్యాయని తెలిపారు. 500కు పైగా జనాభా కలిగి, అప్పటికే ఉన్న గ్రామ పంచాయతీ కేంద్రానికి 1.5 కిలో మీటర్లకు పైగా దూరంలో ఉన్న తండాలు, గూడేలు, ఆవాసాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. తండా గ్రామ పంచాయతీగా మారడంతో గిరిజనులకు సొంత సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యాలయం, నిధులు, స్థానిక అభివృద్ధిపై నిర్ణయాధికారం లభించిందన్నారు. 3,146 మంది సర్పంచులు, 24,682 మంది వార్డు సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులుగా ఏర్పడి గ్రామస్థాయి పరిపాలనలో గిరిజనులకు భాగస్వామ్యం కల్పించారని ఆయన తెలిపారు. ప్రత్యేక గ్రామ పంచాయతీల ద్వారా అంతర్గత రహదారులు, వీధి దీపాలు, తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్యం తదితర మౌలిక వసతులపై స్థానికంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఏర్పడిందన్నారు. తండాలు పెద్ద గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న సమయంలో ఎదురైన పరిపాలనా నిర్లక్ష్యానికి ఇది శాశ్వత పరిష్కారం చూపిన సంస్కరణ అని రవీంద్ర కుమార్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేకంగా ST Special Development Fundకు చట్టబద్ధత కల్పించిందని తెలిపారు. 2022-23లో రూ. 13,412.63 కోట్లు, 2023-24లో రూ. 15,232.62 కోట్లకు నిధులను పెంచినట్లు పేర్కొన్నారు. గిరిజన రైతులకు సాగుభూముల అభివృద్ధి కోసం గిరి వికాసం పథకం ద్వారా వేలాది మంది రైతులకు ప్రయోజనం కల్పించారని తెలిపారు. గిరిజన విద్యార్థుల కోసం నూతన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, IIT-NEET కోచింగ్, STARS వంటి కార్యక్రమాలను చేపట్టడం తో పాటు, గిరిజన యువతకు ఉపాధి అవకాశాల కోసం CM ST Entrepreneur ship & Innovation Scheme, Driver Empower ment Scheme వంటి కార్యక్రమాలను అమలు చేసినట్లు రవీంద్ర కుమార్ వివరించారు. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ గిరిజనుల కోసం అనేక హామీలు ఇచ్చిందని, వాటి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు. ప్రతి గూడెం, తండా గ్రామ పంచాయతీకి ఏటా రూ. 25 లక్షలు కేటాయిస్తామని, కొత్త గిరిజన కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్కో కార్పొరేషన్‌కు రూ. 500 కోట్ల చొప్పున నిధులు ఇస్తామని, కొత్త ITDAలు ఏర్పాటు చేస్తామని, గిరిజన విద్యార్థులకు విద్యా జ్యోతులు అందిస్తామని, ప్రతి మండలంలో SC/ST రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ హామీలు ఇచ్చిందన్నారు. హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా గిరిజనులను మోసం చేయడం సరికాదని ఆయన అన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడం కేవలం పరిపాలనా మార్పు కాదని, గిరిజనులకు ఆత్మగౌరవం, స్వపరిపాలన, అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించిన చారిత్రాత్మక నిర్ణయమని రవీంద్ర కుమార్ పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం గిరిజనుల కోసం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రామావత్ దాస్రూ నాయక్, టీవీఎన్ రెడ్డి,వెల్లుగురి వల్లపు రెడ్డి, జార్పుల లోక్య నాయక్, కౌన్సిలర్ కేతవత్ రుప్లా నాయక్,రమావత్ రమేష్, రామావత్ మోహన్ కృష్ణ, ఇస్లావాత్ అభిషేక్, కేతవత్ శంకర్ నాయక్, కేతవత్ రవీందర్ తదితరులు ఉన్నారు.



# రామదూత... అభయదాత

**శ్రీరాముని కథలో హనుమంతుడిది చాలా విశిష్టమైన పాత్ర. రాముని దాసుడైన హనుమంతుడు భక్తికి, శక్తికి ప్రతీకగా నిలుస్తాడు. వారిద్దరి మధ్య ఉన్న బంధం... భగవంతుడికి, భక్తుడికి మధ్య ఉండే అవినాభావ సంబంధాన్ని తెలియజేస్తుంది. శ్రీరాముడికోసం కొండనైనా ఎత్తి తీసుకురాగలిగే శక్తి హనుమంతుడిది. హనుమంతుడికి ఇచ్చిన వరం కోసం... అతను చిటికెలు వేస్తున్నంతసేపు ఆవలింతలు తీసేంత ప్రేమ శ్రీరాముడిది. ఈ బంధం మన దేశ పౌరాణిక గాథలలో చిరస్థాయిగా నిలిచిపోయింది.**

## వినయశీలి...

శ్రీరాముడి పట్ల హనుమంతుడి భక్తి ఎంత గొప్పదంటే... ఒకసారి సీతాదేవి ఒక ముత్యాలహారాన్ని హనుమంతుడికి బహుమతిగా ఇచ్చింది. ఆ హారంలో ఉన్న ముత్యాలను ఒక్కటొక్కటిగా బయటకు తీసి చూసి "ఇందులో రాముడు లేడు. దీన్ని నేనేం చేసుకుంటాను?" అన్నాడు హనుమంతుడు. "మరి రాముడు ఎక్కడ ఉన్నాడు?" అని అడిగింది సీతాదేవి. "ఇదిగో... రాముడు ఇక్కడ ఉన్నాడు" అంటూ తన గుండెను చీల్చి చూపించాడు హనుమంతుడు. మన సూక్ష్మ శరీరంలో శ్రీరాముడి స్థానం కుడివైపు హృదయ చక్రంలో ఉంటుంది. ఎవరైతే శ్రీరాముని గుణాలను తమ దైనందిన జీవితంలో ఆచరిస్తూ, ఆదర్శవంతమైన జీవనాన్ని కొనసాగిస్తారో... వారి హృదయ చక్రంలో శ్రీరాముడు కొలువై ఉంటాడు. అహంకారాన్ని వారి దరి చేరనివ్వడు. దీనికి ఉదాహరణ హనుమంతుడే. ఆయన ఎంత క్రియాశీలత కలిగి చురుగ్గా పనులు చేస్తూ ఉంటాడో... అంతటి వినయ విధేయతలు కూడా కలిగి ఉంటాడు. మనం కూడా పనులు ఎక్కువగా చేసేకొద్దీ... వినయవిధేయతలు కలిగి ఉంటేనే సమతుల్యతతో ఉండడం సాధ్యమని తెలుసుకుంటాం. ఎప్పుడైతే మన ద్వారా జరుగుతున్న పనులన్నీ మనమే చేసేస్తున్నామనే భ్రమలో చిక్కుకుంటామో.... అప్పుడు అహంకారం బారిన పడతాం. మన ద్వారా జరుగుతున్న పనులన్నిటినీ ఆ భగవంతుని శక్తే జరిపిస్తున్నదనే విషయం తెలుసుకొని, వినమ్రతను కలిగి ఉంటే... భగవంతుడి శక్తికి చక్కని వాహకాలుగా మారుతాం. మరిన్ని మంచి పనులు చేయగలుగుతాం.

## భజే వాయువేగం...

హనుమంతుడి నుంచి మనం నేర్చుకోవాల్సిన మరో విషయం ఏమిటంటే... ఆయన ఏ పనినైనా చాలా వేగంగా చేస్తాడు. ఆయనది వాయువేగం. రాముడు తన సందేశాన్ని సీతాదేవికి పంపాలనుకున్నప్పుడు... తన ఉంగరాన్ని హనుమంతుడికి ఇచ్చి పంపిస్తాడు. ఎందుకంటే ఆ పనిని హనుమంతుడు చేయగలిగేంత వేగంగా శ్రీరాముడు చేయలేడు. అలాగే, సంజీవనీ మూలిక అవసరమైనప్పుడు.... అది ఒక ప్రత్యేకమైన పర్వతం మీద ఉంటుందని చెప్పి, దాన్ని తీసుకురావాలని హనుమంతుణ్ణి పంపించాడు శ్రీరాముడు. అక్కడికి వెళ్ళిన హనుమంతుడు ఆ మూలికకోసం వెతుకుతూ సమయం వృధా చేయడం ఎందుకని... మొత్తం పర్వతాన్నే తీసుకువచ్చేశాడు. ఏ పని చేసినా వెంటనే చేయడం, వేగంగా చేయడం, సమయాన్ని వృధా కానివ్వకపోవడం హనుమంతుడి లక్షణం. హనుమంతుడి ఆశీస్సులు పొందినవారికి 'సత్-అసత్ వివేక బుద్ధి' లభిస్తుంది. అంటే 'ఏది సత్యం? ఏది అసత్యం?' అని తెలుసుకోగలిగే వివేకం కలుగుతుంది. 'ఏది మంచి? ఏది చెడు?' అనే విచక్షణ కలిగిన మనిషి చెడు నుంచి దూరంగా ఉంటాడు, తనను తాను రక్షించుకోగలుగుతాడు. సన్మార్గంలో నడిచి ఆధ్యాత్మికంగా ఉన్నతిని పొందుతాడు. హనుమంతుడి గుణాలైన వినయ విధేయతలను, భక్తితో కూడిన శక్తిని దైనందిన జీవితంలో మనం కూడా అలవరచుకుంటే ఆయన అనుగ్రహాన్ని, శ్రీరాముడి కృపా కటాక్షాలను నిరంతరం పొందగలం. మానవుల సూక్ష్మ శరీరంలోని పింగళా నాడి మొత్తాన్ని హనుమంతుడు ప్రభావితం చేస్తాడు. పింగళా నాడికే 'సూర్య నాడి' అనే మరో పేరు ఉంది. ఇది మానవులకు క్రియాశక్తిని ప్రసాదిస్తుంది. అంటే మానవులకు పనులు చేయడానికి కావలసిన శక్తి ఈ నాడి నుంచే లభిస్తుంది. కానీ పనులు ఎక్కువగా చేస్తూ, విశ్రాంతి తీసుకోవడం మరచిపోయినప్పుడు... ఆ నాడిలో వేడి ఎక్కువై అనేక రకాల వ్యాధులకు దారి తీస్తుంది. మానవుల పింగళా నాడి మీద తాను పనిచేసి, అక్కడ అధికంగా ఉండే సూర్యతాపం నుంచి వారిని రక్షించి, చల్లదనాన్ని ప్రసాదించడం తన బాధ్యత అని హనుమంతుడికి ఆయన జన్మించే సమయానికే తెలుసు. అందుకే బాల్యంలోనే సూర్యుణ్ణి మింగెయ్యడానికి ప్రయత్నించాడు. దేవతలు ప్రార్థించడంతో... సూర్యుణ్ణి విడిచిపెట్టాడు.

ఒక వ్యక్తి శారీరకమైన అవయవానికి కార్డియాలజిస్టుగా చికిత్స చేస్తూ ఉంటాను. అదే సమయంలో... ఆ వ్యక్తి హృదయంలోని నిశ్శబ్దమైన అరల్లో సూక్ష్మమైన, నిరంతరమైన సంభాషణ ఒకటి కొనసాగుతూ ఉంటుంది. అది స్టెతస్కోపులో వినిపించదు. ఈసీజీలో కనిపించదు. అయినప్పటికీ అది మన జీవితాల గమనాన్ని నిర్దేశిస్తూ ఉంటుంది. ఈ సంభాషణ భారతీయ తత్త్వశాస్త్రంలో లోతుగా వర్ణించిన రెండు పురాతనమైన శక్తుల మధ్య జరుగుతుంది. అవి: శ్రేయస్సు, ప్రేయస్సు. శ్రేయస్సు అంటే హితమైనది, మనకు మంచి చేసేది, మన ఉన్నతికి దోహదం చేసేది. ప్రేయస్సు అంటే ప్రియమైనది. అది ఇంద్రియ సంతృప్తి, సౌకర్యం, స్వల్పకాలిక తృప్తి లాంటివాటికి... అంటే తాత్కాలికమైన సుఖాన్ని అందించేవాటికి ప్రతీక. అది మనలోని ఆవేశాలను, కోరికలను, తరచుగా మన బలహీనతలను ప్రేరేపిస్తుంది. ఈ వైరుధ్యాన్ని 'కఠోపనిషత్తు'లో ఋషులు చక్కటి స్పష్టతతో వివరించారు.



# హితమా? ప్రియమా?

## అది ఒక సంస్కృతి

మరొకవైపు శ్రేయస్సు ఉన్నతమైన మేలుకు మార్గం. తక్షణమే అది సులభం కాకపోవచ్చు. కానీ ఎదుగుదలకు, అంతర్గతమైన పరిశుద్ధతకు, అంతిమంగా మోక్షానికి దారి తీసే ఎంపిక. నేటి వేగవంతమైన ప్రపంచంలో, ప్రేయస్సు తాలూకు ఆకర్షణ ఇదివరకటికన్నా బలంగా మారింది. తక్షణం పొందే తృప్తి అనేది కేవలం ఒక ధోరణి మాత్రమే కాదు, అది ఒక సంస్కృతి. అనారోగ్యకరమైన జీవనశైలి ఎంపికలు కావచ్చు, భావోద్వేగ ప్రతిచర్య కావచ్చు, నిరంతరం గుర్తింపు కోసం ఆరాటపడడం కూడా కావచ్చు... దీర్ఘకాలంలో మనకు ఏది మంచిది అనే దానికన్నా... ఇప్పుడు ఏది బాగుంటుందనుకుంటామో దాన్నే మనం పదేపదే ఎంచుకుంటూ ఉంటాం. మానసికమైన దృక్పథంలోంచి చూసినప్పుడు, ఇది 'ఆలస్యమైపోయిన తృపి'?త అనే భావనకు దగ్గరగా ఉంటుంది. భవిష్యత్ ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటూ... తక్షణం లభించే ప్రతిఫలాలను తిరస్కరించే వ్యక్తులు భావోద్వేగపరంగా, సామాజికంగా, వృత్తిపరంగా మెరుగైన ఫలితాలు పొందుతారు. లింబిక్ వ్యవస్థ, ప్రీఫ్రంటల్ కార్టెక్స్ మధ్య జరిగే పరస్పర చర్య ఉదాహరణతో దీని గురించి న్యూరోసైన్స్ వివరిస్తుంది.

## దాన్నే ఎంచుకోండి...

ప్రతిరోజూ హృదయపూర్వకమైన ధ్యానం ద్వారా... మనస్సు క్రమంగా ప్రశాంతతంగా మారుతుంది, శుద్ధిని పొందుతుంది. శుద్ధి చేసుకొనే అభ్యాసం మనల్ని ప్రేయస్సు వైపు లాగే భావోద్వేగ ముద్రలను (సంస్కారాలను) తొలగించడానికి తరచుగా సాయపడుతుంది. ప్రార్థన మనల్ని ఒక ఉన్నతమైన మూలంతో అనుసంధానిస్తుంది. మన అంతర్గతమైన సంకల్పాన్ని బలోపేతం చేస్తుంది. కాలం గడిచేకొద్దీ ఈ అభ్యాసాలు అంతర్గతమైన అవగాహనను పెంపొందిస్తాయి. ప్రేరణలను అనుసరించి ప్రవర్తించే వ్యక్తి ముందుగానే వాటిని గమనించడం మొదలుపెడతాడు. ఆ విరామమే పరివర్తనాత్మకంగా మారుతుంది. ఒక వ్యక్తి ప్రేయస్సు కన్నా శ్రేయస్సును చైతన్యవంతంగా ఎంచుకోవడానికి అది అనుమతిస్తుంది. హృదయం సూక్ష్మ విచక్షణను (వివేకాన్ని) పెంచుకుంటుంది. ఒకప్పుడు సంఘర్షణగా ఉన్నది ఇప్పుడు సహజమైన ప్రాధాన్యతగా మారుతుంది. కాబట్టి, హార్ట్‌ఫుల్‌నెస్ బయటి నుంచి క్రమశిక్షణను విధించదు, లోపలి నుంచి దాన్ని మేల్కొలుపుతుంది. మనలోని ఉన్నతమైన తోడేలుకు బలంతో కాకుండా... అవగాహన, ప్రేమ, అంతర్గత అనుసంధానత ద్వారా పోషణ లభిస్తుంది. జీవితంలోని ప్రతి కూడలిలోనూ ఆగండి. 'ఇప్పుడు ఇది నాకు కేవలం సంతోషాన్ని కలిగిస్తోందా? లేదంటే నన్ను మరింత గొప్ప స్థితి కోసం తీర్చిదిద్దుతోందా?' అని ఆలోచించండి. మిమ్మల్ని ఉన్నతివైపు నడిపించే తోడేలుకు ఆహారాన్ని అందించండి. శ్రేయస్సు మీ స్వభావంలో భాగం అయ్యేవరకూ దాన్ని పదేపదే ఎంచుకోండి.

## రెండు తోడేళ్ళు

ప్రేయస్సు తత్వాన్ని పదే పదే ఎంచుకోవడం అనే ప్రక్రియ శరీరంలో ఎలా వ్యక్తమవుతుందో ఒక కార్డియాలజిస్టుగా నేను తరచుగా చూస్తూ ఉంటాను. కదలకుండా ఉండే అలవాట్లు, సరైన ఆహారాన్ని తీసుకోకపోవడం, ఒత్తిడికి లొంగిపోవడం, వ్యసనాలు వీటిలో ప్రధానమైనవి. ఈ ఎంపికలు ఎక్కువై పోగు పడి... అధిక రక్తపోటు, మధుమేహం, హృదయ సంబంధమైన వ్యాధులకు దారితీస్తాయి. శ్రేయస్సు ఆధారితమైన జీవితం... క్రమశిక్షణ, వ్యాయామం, భావోద్వేగ సమతుల్యతల ద్వారా శక్తిమంతమైన నివారణ ఔషధంగా పని చేస్తుంది. శ్రేయస్సు, ప్రేయస్సులను మనలో ఉండే రెండు తోడేళ్ళుగా దాజీ అభివర్ణించారు. ఒకటి ఉన్నతమైన ఆకాంక్ష, దయ, క్రమశిక్షణ, ఆధ్యాత్మికమైన పరిణామాలకు ప్రతీక. మరొకటి భోగ విలాసాలు, పరధ్యానం, అహం ద్వారా ప్రేరితమయ్యే వాంఛలకు ప్రతీక. మనం దేన్ని పెంచి పోషిస్తామో అది మరింత బలపడుతుంది. ఉన్నతమైన తోడేలుకు చైతన్యవంతమైన పోషణను అందించే ఆచరణాత్మకమైన, అనుభవపూర్వకమైన మార్గాన్ని హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానం అందిస్తుంది.

# మర్యాద రామన్నలకు మత్తు చురక

సమయం ప్రతినిధి : ఉదర పోషణార్థం జీవి ఎన్నో అగచాట్లు పడతాడు, ఎన్నో వేషాలు వేస్తాడు. ఈ తిప్పలన్నీ తప్పనివి. సమాజమే ఒక పెద్ద ప్రయోగశాల కనుక ఈ సమాజంలోనే ఈ సమాజపు నకిలీ విలువల్ని ఎండగట్టే thinkers, artists కూడా వస్తూంటారు. ఎంతమంది ఎన్ని విధాలుగా ప్రశ్నించినా మనిషికి ఇంకా ముసుగు అవసరంగానే మిగిలింది. కవి శిఖామణి కవితా సంపుటి 'మువ్వల చేతి కర్ర'లో ఓ కవిత మనిషి సందర్భానుసారం ఒక్కో ముసుగునూ తొడుక్కోవడాన్ని ప్రస్తావిస్తూ నిరుత్సాహాన్ని ప్రకటిస్తుంది. ఈ సమాజపు చీకటి కోణంలో ఉన్నవి కల్లు కాంపౌండ్‌లూ, అనామక నిషిద్ధ సాంగత్యాలూ. మర్యాదా రామన్నలకూ ఈ రెండూ కావాలి. ఎందుక్కావాలంటే భువి నుండి దివికుండే మోక్షద్వారం ఎక్స్‌ప్రెస్ వే లాగ signboardsతోనూ, exit markersతోనూ ఉండదు. అది దేహాత్మకు ఏమంత సులువుగా చిక్కేది కాదు. తన కాలంలోనే ఫ్రెంచ్ సింబలిస్ట్ కవీ ఆధునిక కవితా పితామహుడూ అయిన బోద్లేర్ (Charles Baudelaire), "ఓ పాఠకుడా నువ్వు ఆత్మవంచకుడివి, నా ప్రతిబింబానివి, నా సోదరుడివి" అని అన్నాడు. అది విమర్శా హితోపదేశమా confession అనిపించేటంత నిజాయితీతో తెగేసి చెప్పాడు. వెర్ల (Paul Verlaine) వంటి తదనంతర కవులూ అదే చెప్పారు. అనిల్ బత్తుల గారి 'మధుశాల'లో ఈ ఆత్మాన్వేషి అన్నీ వదిలేసుకున్నవాడో ఏమీలేనివాడో అయితే అక్కడి దాకా ఈ కవిత్వంలో థీమ్ కాస్త పాతదే. సత్యాన్వేషణకు ఏదో చీకట్లోకి పారిపోవడమైనా, ఉత్థానానికి మధువునూ నిషిద్ధ ప్రణయాన్నీ ఆశ్రయించడం వంటి పతనానికి పూనుకున్నా అది మృషానైతికతను నటించే సమాజానికీ పెద్దలకూ చెంపపెట్టుగా మార్పు చెందడం కూడా తెలిసిన విషయమే. కొత్తదనం ఎక్కడా అంటే ఈ పుస్తకం పాఠకులకు అందించే సమగ్రానుభవంలో. కవితకు మాంత్రిక వాస్తవికత (magical realism) అలంకారపు పనిముట్టుగా (aes-thetic tool) వాడుకొని, తను ఆగి, పాఠకుల్ని ఆపి, ఆచి తూచి, తెలుగు సరిగమల్ని పలికిస్తూ ప్రసాదగుణప్రధానంగా లేత లేతగా రాశారు అనిల్. ఇందులో ఇది పచ్చిగా ఉంది అనిపించే వాక్యశకలాలు నిజానికి బీభత్సరసం పుట్టే అరుదైన అలంకారాలు. ఈ కవిత్వంలో డజన్లకొద్దీ కనిపించే వైరిసమాసాల వినియోగం నియమోల్లంఘనను ఆదర్శప్రాయంగా చూపిస్తూ మర్యాదా రామన్నలకు చురక తగిలించడం. మొత్తంగా అనిల్ బత్తుల గారి కవిత పాఠకుల దేహాత్మలను లతలా పెనవేసుకుంటుంది. ఆద్యంతరహితమైన విశ్వంలో కవి కవిత ఆద్యంతరహితంగానే ఉంటూ చివరికి మొదటికే చేరుకుంటుంది. ఇది కవిత్వ ప్రయోజనాన్ని అన్యాపదేశంగా నిలబెట్టడం. "మనుషులు మానని గాయాల్ని చేస్తారు" అన్న జ్ఞానం ఈ సంపుటిలో ముఖ్యమైనది. ఇది ముసుగు తొడుక్కోవడమనే అవసరం వల్ల కలిగిన రుగ్మత. కవితల్లో పదాలు, వాక్యశకలాలు కాస్త తెరిపినిచ్చిన తరవాత మళ్ళీ కనిపించడం కవి సంగీతజ్ఞతకే కాక జీవితంలోని నిరవధికంగా కనిపించే నీరసమైన సంఘటనల పౌనఃపున్యానికీ (repetition) నిదర్శనం. "నా రహస్య శృంగార దేవతా/ దైవం మనకొద్దు/ మోక్షం అసలే వద్దు/ ఈ క్షణం చాలు" అన్నప్పుడు కవి ఒక తపస్సమాధిలో ధ్యానిస్తున్నాడు. ఇక్కడ 19వ శతాబ్దపు ఫ్రెంచ్ కవుల లోతైన అంతరంగాన్నీ, రిల్కే భావించిన శరణాలయం వంటి నిశ్శబ్ద విశాల సాంగత్యాన్నీ తలపిస్తూ ఆ అంతరంగ సహచరి పొందు కవిని పవిత్రీకరించింది. దుఃఖం లేని లోకం ఎంత భయానకమైందో, అక్కడి జీవితం ఎంత నరకప్రాయమో కవికి తెలుసును. ఆమె మరణించగానే "దుఃఖపు ప్రేమ చర్మంతో నా శవపేటికను సిద్ధం చెయ్యండి" అన్నప్పుడు ఈ ఆత్మాన్వేషి కేవలం కాముకుడు కాదని, ఆమె అపరిమిత ప్రేమలో తన దేహాత్మను శోధించుకునే సత్యవ్రతుడనే అసలు నిజం బట్టబయలౌతుంది. ఇందులో అన్నీ ప్రేమికుల మధ్య జరిగే సంగతులు కావు. 'ధార' వంటి అనామకుడి ఏకాంతాన్ని పరిచయం చేసే కవితలో రెండున్నాయి. ప్రకృతి కవితలనాలో, ప్రేమ కవితలనాలో గానీ అటువంటివీ కొన్ని ఉన్నాయి. ఆవేదననూ, ఆక్రోశాన్ని వ్యక్తపరిచేవీ ఉన్నాయి. ఏకాకీ న రమతే అని ఉపనిషద్వాక్యం. ఆత్మాన్వేషి రమించడానికేనా ఆ సహచరి ఉన్నది? కవికి స్త్రీ అంటే ఉన్న కళారాధన, గౌరవం ప్రతి మాటలోనూ తొంగిచూస్తాయి. చివరి కవితను చదివిన పాఠకులు తమ బరువు తగ్గి మనసు బరువెక్కి అంతలోనే తేలికపడి కళ్ళు చెమర్చి మసకబారగా రిలాక్స్ అవడం కవి విజయం. గ్రీక్ లాక్షణికులు వివరించిన catharsis ఇదే.




ఆహా కళ్యాణం వెబ్‌సిరీస్‌లో పవి టీచర్ పాత్రతో గుర్తింపు పొందిన తమిళ నటి బ్రికిడా సాగా వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టింది. తన సుదీర్ఘకాల ప్రియుడు, నటుడు అనంత్ రామ్‌ను ఆమె వివాహం చేసుకుంది. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో సాంప్రదాయబద్ధంగా వీరి పెళ్లి వేడుక ఘనంగా జరిగింది. గత జులైలో కుటుంబ సభ్యుల సమక్షంలో నిశ్చితార్థం చేసుకున్న ఈ జంట, తాజాగా మూడుముళ్ల బంధంతో ఒకటయ్యారు. పెళ్లికి సంబంధించిన వర్ణరంజితమైన ఫోటోలు, వీడియోలను బ్రికిడా సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ ఫోటోలలో ఇద్దరూ సాంప్రదాయ దుస్తులలో మెరిసిపోతూ కనిపించారు. అనంత్ కూడా నటుడే. వీరిద్దరూ ఒకే కాలేజీలో చదువుకున్నప్పటికీ సినిమా ప్రీమియర్ షోలలో కలుసుకోవడం ద్వారా వీరి పరిచయం ప్రేమగా మారింది. అనంత్ కూడా మంచి మంచి సినిమాలే చేశాడు. ముఖ్యంగా సినిమాపై ఇద్దరికీ ఉన్న ఇష్టం, నటుడు ధనుష్‌కి ఇద్దరూ తీవ్రమైన అభిమానులు కావడం వీరి మధ్య బంధాన్ని మరింత బలపరిచింది. పెళ్లి ప్రతిపాదనతోనే బంధాన్ని ప్రారంభించిన ఈ జంట ఎట్టకేలకు పెద్దలను ఒప్పించి ఒక్కటయ్యారు. వెబ్‌సిరీస్‌లతో నటన ప్రారంభించిన బ్రికిడా, ఆ తర్వాత వెండితెరపై కూడా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా దళపతి విజయ్ నటించిన మాస్టర్ సినిమాతో పాటు ధనుష్ రాయన్ చిత్రంలో కీలక పాత్రల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తెలుగులోనూ సింధూరం వంటి సినిమాలతో ప్రేక్షకులకు దగ్గరయ్యింది. నటి బ్రికిడా వివాహ వార్త తెలిసిన సినీ ప్రముఖులు, అభిమానులు పవి టీచర్ పాత్రను అభిమానించే నెటిజన్లు ఈ కొత్త జంటకు సోషల్ మీడియా వేదికగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.




ఈమధ్య క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ఈ ఏడాది మలయాళంలో వచ్చిన పోలీస్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్స్ అన్నీ మంచి విజయాలను అందుకున్నాయి. మలయాళంలోనే కాకుండా తెలుగులో కూడా ఇలాంటి ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ వచ్చింది. అదే పంచనామా. 'ప్రేమిస్తే' ఫేమ్ భరత్ హీరోగా మోహన్ శ్రీవత్స దర్శకత్వంలో తెరకెక్కిన క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ సిరీస్ పంచనామా. ఈ సినిమాను ఒకప్పుడు యాంకర్ గా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును అందుకున్న ఉదయభాను, మిద్దే విజయేంద్ర మౌళితో కలిసి నిర్మించింది. గత శు క్రవారం జీ5లో రిలీజ్ అయిన పంచనామా ఎలా ఉంది.. ? అనేది తెలుసుకుందాం. కథ విషయానికొస్తే.. జయరామ్ (భరత్) చిన్నతనంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకుంటాడు. అక్క, బావల వద్ద పెరుగుతాడు. కానీ, అనుకోకుండా వారు కూడా అతనికి దూరమవుతారు. ఇక జయరామ్ కష్టపడి పోలీస్ అవుతాడు. అంతా బాగుంది అనుకున్న సమయంలో జయరామ్ తమ్ముడు ఆది (చరణ్ బాబు) అనుమానాస్పద రీతిలో హాస్టల్ గదిలో మరణిస్తాడు. పోలీసులు అది సాధారణ చావుగా భావించినప్పటికీ, జయరామ్ మాత్రం దాన్ని హత్యగా అనుమానిస్తాడు. ఇన్వెస్టిగేషన్ ప్రారంభించగా ఒక్క ఆది మాత్రమే కాక, అదే రోజు మరణించిన మరో ఇద్దరి వేలిముద్రలు కూడా ఒక్కటే అని తేలడంతో కథలో పెద్ద ట్విస్ట్ మొదలవుతుంది. ఈ వరుస మరణాల వెనుక వైద్య రంగంలో జరుగుతున్న అక్రమాలు, హ్యూమన్ క్లినికల్ ట్రయల్స్, మెడికల్ మాఫియా ఉన్నాయని గ్రహించిన జయరామ్, ఆ క్రైమ్ నెట్‌వర్క్‌ను ఎలా ఛేదించాడు.. ? మెడికల్ మాఫియా వెనుక ఉన్నది ఎవరు.. ? అసలు ఆది ఎవరు.. ? అనేది పంచనామా చూసి తెలుసుకోవాల్సిందే. మొత్తం 6 ఎపిసోడ్లుగా రూపొందిన ఈ సిరీస్‌ను దర్శకుడు ఒక ఆసక్తికరమైన మెడికల్ థ్రిల్లర్ పాయింట్‌తో ప్రారంభించాడు. సామాన్యులను లక్ష్యంగా చేసుకుని ఫార్మా కంపెనీలు చేసే ప్రయోగాలు, ఆర్గాన్స్ ట్రాఫికింగ్ వంటి అంశాలను చూపించిన తీరు బాగుంది. ప్రారంభ ఎపిసోడ్లలో ఫింగర్ ప్రింట్ మిస్టరీ, ఒక్కో క్లూ ఆధారంగా హీరో ఇన్వెస్టిగేషన్ ముందుకు తీసుకెళ్లే సన్నివేశాలు ప్రేక్షకుల్లో తీవ్రమైన ఆసక్తిని కలిగిస్తాయి. బ్యాక్ అండ్ ఫోర్త్ స్క్రీన్ ప్లే ద్వారా కథలోని ఎమోషనల్ యాంగిల్స్, నేర నేపథ్యాన్ని కనెక్ట్ చేయడానికి దర్శకుడు ప్రయత్నించాడు. అయితే, మొదటి నాలుగు ఎపిసోడ్లలో ఉన్న వేగం, ఉత్కంఠ చివరి రెండు ఎపిసోడ్లకు వచ్చేసరికి కాస్త మందగిస్తాయి. రెగ్యులర్ థ్రిల్లర్ ఫార్మాట్ కావడంతో మెయిన్ విలన్ ఎవరనేది ఊహించడం తేలికైపోయింది, దీనివల్ల క్లైమాక్స్ ట్విస్ట్ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. నటీనటుల విషయానికి వస్తే, భరత్ ఖాకీ దుస్తుల్లో పోలీస్ ఆఫీసర్‌గా చాలా సీరియస్ పాత్రలో ఒదిగిపోయాడు. కథను తన భుజాలపై నడిపించడంలో ఆయన నటన ప్లస్ పాయింట్‌గా నిలిచింది. ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో భరత్ పోలీసాఫీసర్ గా కనిపించాడు. హీరోయిన్‌గా మేఘా రెడ్డి, నెగటివ్ ఛాయలున్న పాత్రల్లో రూపా లక్ష్మి, సూర్య శ్రీనివాస్, తండ్రి పాత్రలో శివాజీరాజా తమ పరిధి మేర మెప్పించారు. అసలు కథ సెకండ్ సీజన్ లో ఉంటుందని చెప్పి ముగించడంతో సిరీస్ అంతా పూర్తి అయిన సంతృప్తి కలగదు. ఏదో త్వరత్వరగా ముగించాలి అని చేసినట్లు అనిపిస్తుంది. లాజిక్స్ కానీ, ఉత్కంఠని దర్శకుడు మర్చిపోయినట్లు ఉన్నాడు. సాంకేతికంగా నరేష్ కుమారన్ నేపథ్య సంగీతం థ్రిల్లింగ్ సీన్లను ఎలివేట్ చేయగా, సందీప్ కాంత్ ఛాయాగ్రహణం సిరీస్‌కు కావాల్సిన క్రైమ్ మూడ్‌ను అందించింది.




సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో వరుస అవకాశాలతో దూసుకుపోతున్న క్రేజీ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే . లెనిన్ తో ఈ చిన్నది భారీ విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం తెలుగులో స్టార్ హీరోయిన్ రేసులో భాగ్యశ్రీ మొదటి స్థానాన్ని ఆక్రమించే పనిలో ఉంది. ఇక సినిమాల విషయం పక్కన పెడితే అమ్మది అందానికి ఫిధా కానీ వారుండరు అంటే అతిశయోక్తి కాదు. ఇటీవల జరిగిన ప్రతిష్టాత్మక సైమా 2026 అవార్డుల ప్రదానోత్సవంలో భాగ్యశ్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దుల్కర్ సల్మాన్ సరసన నటించిన కాంత చిత్రంలో కుమారి పాత్రలో కనబరిచిన అద్భుత నటనకు గానూ ఆమె బెస్ట్ యాక్ట్రెస్ (క్రిటిక్స్) కేటగిరీలో ఈ పురస్కారాన్ని దక్కించుకుంది. ట్రోఫీతో పాటు రెడ్ కార్పెట్‌పై ఆమె ఇచ్చిన గ్లామరస్ పోజులు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

## Cinema




నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' సినిమా వాయిదా పడుతుందేమోననే సందేహాన్ని కొద్ది రోజుల వరకూ ట్రేడ్ వర్గాలు వ్యక్తం చేస్తూ వచ్చాయి. అయితే అనుకున్న విధంగా సినిమాను సెప్టెంబర్ 24న ఎట్టిపరిస్థితుల్లో విడుదల చేస్తామని, అందుకోసం ట్రైలర్ ను సైతం విడుదల చేయడం లేదని హీరో నాని తెలిపారు. ప్రతి నిమిషం తమకు విలువైనదేనని అందుకోసం సాంకేతిక నిపుణులు అహోరాత్రులు పని చేస్తున్నారని ఆయన ఇటీవల జరిగిన మీడియా సమావేశంలో తెలిపారు. దాంతో 'ది ప్యారడైజ్' ఆగమనం ఖాయమని తేలిపోయింది. దసరా' మూవీ తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబోలో తెరకెక్కుతున్న సినిమా కావడంతో 'ది ప్యారడైజ్'కు మొదట్లోనే బజ్ క్రియేట్ అయ్యింది. ఇక ప్రచార గీతాలు విడుదలైన తర్వాత అది అంబరాన్ని తాకింది. నానిని సరికొత్తగా చూడబోతున్నామని ఫ్యాన్స్ భావిస్తుంటే... మేకింగ్ పరంగా సినిమా ఏ స్థాయిలో ఉంటుందో ఆ పాటలు నిరూపించాయి. ఖచ్చితంగా టాలీవుడ్ లో 'ది ప్యారడైజ్' సరికొత్త రికార్డులు సృష్టిస్తుందని అంతా నమ్ముతున్నారు. అయితే ఇదే సమయంలో 'ప్యారడైజ్' కలెక్షన్స్ పై గణేశ్ నిమజ్జనం ప్రభావం చూపించబోతోంది. సెప్టెంబర్ 14న ప్రతి ఒక్కరూ వినాయక చవితి పండగను ఘనంగా చేసుకున్నారు. మరీ ముఖ్యంగా నైజాంలో ఈ పండగను వాడవాడలా చేసుకుంటారు. ప్రతి గల్లీ వినాయక మండపాలతో కళకళలాడుతుంటుంది. సహజంగా ఇళ్ళలో గణపతిని పెట్టుకుని పూజలు చేసుకునే వారు మూడో రోజు, ఐదో రోజు, ఏడో రోజు విగ్రహాలను నిమజ్జనం కోసం సమీపంలోని చెరువులకు వెళతారు. మరికొందరు ఉత్సాహవంతులు పనికట్టుకుని దేశ రాజధానిలో ఏ మూల నివాసం ఉన్నా... హుస్సేన్ సాగర్ కు వచ్చి నిమజ్జనం చేస్తారు. అయితే సహజంగా గణేశ్ మండపల్లోని విగ్రహాలను మాత్రం చాలా వరకూ పదకొండో రోజున నిమజ్జనానికి తీసుకొస్తారు. ఆ రకంగా చూస్తే ఈ ఏడాది 11 వ రోజు 24వ తేదీ వచ్చింది. ఇది నాని 'ప్యారడైజ్' మూవీ విడుదలయ్యే రోజు. ఆ రకంగా అందరూ అదే రోజు నిమజ్జనం చేస్తే... సినిమా ఓపెనింగ్ డే కలెక్షన్స్ ఖచ్చితంగా ఎఫెక్ట్ అవుతాయి. ఈసారి నిమజ్జనం 11వ రోజు కాకుండా 12వ రోజు జరగుతుందని అంటున్నారు. అంటే సెప్టెంబర్ 25న జరుగుతుందన్న మాట. సహజంగా వినాయక నిమజ్జనాన్ని అనంత చతుర్దశి రోజు చేస్తారని, ఆ ముహూర్తం ఈసారి 25వ తేదీ వచ్చిందని పండితులు చెబుతున్నారు. అందువల్ల 25న రాష్ట్రవ్యాప్తంగా నిమజ్జనం చేసినా... అది 'ప్యారడైజ్' మూవీకి రెండో రోజు. సో... సినిమా విడుదలైన మర్నాడు ఈ నిమజ్జన ప్రభావం కలెక్షన్స్ పై పడుతుంది. ఎందుకంటే... సాధారణ ప్రజలు నిమజ్జనంను పక్కన పెట్టి... ఎంత గొప్ప సినిమా అయినా చూడటానికి థియేటర్ కు వెళ్ళడానికి ఆసక్తి చూపించరు. ఆ రకంగా 'ది ప్యారడైజ్' వీకెండ్ కలెక్షన్స్ పై వినాయక నిమజ్జనం ప్రభావం ఖచ్చితంగా పడుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. అయితే సినిమాకు ఏమాత్రం పాజిటివ్ టాక్ వచ్చినా... జనాలు శని, ఆదివారాల్లో ఈ సినిమాను చూసి మొదటి రెండు రోజుల కలెక్షన్స్ లోటును తీర్చుతారేమో చూడాలి.

మీ ప్రత్యేకతను,
మీ వ్యాపార అభివృద్ధికి
కొందరు మాత్రమే
నమ్మకమైన సేవలందిస్తారు..



మీ శ్రేయస్సును ఆకాంక్షించే వారికి
ఆత్మీయతను పంచండి

మధురస్మృతులు
ద్వారా శుభాకాంక్షలు తెలియజేయండి మరింత
దగ్గరవ్వండి. మీ కుటుంబం సభ్యులలో,
మీ బంధుమిత్రులలో, మీ ఆఫీసులో సహోద్యోగి
ఎవరైనా రిటైర్ అవుతున్నా, వైవాహిక జీవితం
60 వసంతాలు పూర్తి చేసి వసంతోత్సవం
జరుపుకుంటున్నా, ప్రశంసలు అందుకున్న ఆయా
సందర్భాల్లో వారి జీవిత విశేషాలు మధురస్మృతులు తో
పంచుకోండి. పలువురికి ఆదర్శప్రాయులు కండి.



మా కార్యాలయము :-
మధురస్మృతులు
మాస పత్రిక
SREEJA SREE PUBLICATIONS
H.No: 1-3-129, Rajendra Nagar,
Mahabubnagar. PIN - 509001.
Ph : 9848997085, 08542-222814
e-Mail : ms.mbnr2@gmail.com

OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085